శనివారం
02-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 11
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైతన్య ఫీజుల మాఫియాపై
ఎస్ఎఫ్ నిరసన-నేతల అరెస్టు
ఇష్టానుసారంగా దోపిడీ: జాన్సన్‌బాబు, శివారెడ్డి

విజయవాడలో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు జాన్సన్‌బాబు, ఇతన నాయకులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో ఫీజుల మాఫియాకు తెరలేపి, టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్ పేర్లతో విద్యార్థులను, తల్లిదండ్రులను మోసగిస్తున్న శ్రీచైతన్య పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ, విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీచైతన్య స్కూల్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నేతలను పోలీసులు అరెస్టు చేశారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టు చేసి, విజయవాడలోని భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, శివారెడ్డి నాయకత్వం వహించగా, రాష్ట్ర నాయకులు శ్రీరాములు ఫణీంద్ర, ఓబులేశ్, అప్పలస్వామి, మస్తాన్ వలరాజు కుళాయి స్వామి రాజేంద్ర చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాగరాజు, శశికుమార్, ఉదయ్‌రవి, సోమన్న, సుబ్బరాయుడు, సాయి కుమార్ పవన్ తదితరులు పాల్గొన్నారు. జాన్సన్‌బాబు, శివారెడ్డి మాట్లాడుతూ చైతన్య, నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. కనీస నిబంధనలను పాటించకుండా, రాష్ట్ర వ్యాప్తంగా వేలాది బ్రాంచీలను నడుపుతున్నాయన్నారు. ప్రభుత్వ పరంగా పక్కాగా జీవోలు ఉన్నప్పటికీ, పాఠశాల/ కళాశాలలో పుస్తకాలు, దుస్తులు ఎలాంటి మెటీరియల్ అమ్మరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడం లేదన్నారు. ఒకటి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు దొంగ ర్యాంకులు వేసుకుని, పుస్తకాల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. భవన సముదాయాల్లో ఇరుకైన ప్రదేశాల్లో పాఠశాలలను నడుపుతున్నారని విమర్శించారు. విద్యాహక్కు చట్టం నిబంధనలను అమలు చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 30శాతం రాయితీ కల్పించకుండా మోసం చేస్తారా? అని నిలదీశారు. అక్రమ అరెస్టులను ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజేంద్ర, నక్కా లెనిన్ బాబు తీవ్రంగా ఖండించారు.

జగన్ సర్కార్‌కు
చుక్కెదురు
ఆన్‌లైన్ సినిమా టికెట్ల విక్రయాలపై హైకోర్టు స్టే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో సినిమా టికెట్ల వివాదం కొలిక్కి రావడం లేదు. ఆన్‌లైన్‌లో విక్రయించాలని ప్రభుత్వం, అది మంచి పద్ధతి కాదని డిస్ట్రిబ్యూటర్లు పట్టుబడుతుండడంతో చివరకు ఈ వివాదం హైకోర్టుకి చేరింది. దీనిపై కోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఆన్‌లైన్ ద్వారా సినిమా టికెట్ల విక్రయ విధానంపై హైకోర్టు స్టే విధించింది. సినిమా టికెట్ల అమ్మకాల్లో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఆన్‌లైన్ విధానం తీసుకొస్తున్నామని ప్రభుత్వం చెపుతోంది. అందు కోసం ప్రభుత్వ పరిధిలోని ఏపీ ఫిలిం డెవలప్ మెంట్ కార్పోరేషన్ పరిధిలో నిర్వహించే పోర్టల్ ద్వారా ఈ టికెట్లను అమ్మాలని నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయం పై సినీ పెద్దలతో కూడా సీఎం జగన్, నాటి సమాచార శాఖ మంత్రి పేర్ని నాని సమావేశాలు నిర్వహించారు. ఆ సమావేశాల్లో ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు సినీ పెద్దలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకెళ్ళింది. ఎగ్జిబిటర్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. థియేటర్లు మరియు ప్రైవేట్ సంస్థలు ఈ గేట్ వే ద్వారానే సినిమా టికెట్ల విక్రయాలు చేపట్టాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు నెల రోజుల్లో థియేటర్లు

- మిగతా 2 లో

మరో సమరానికి
సన్నద్ధం
3లో
ఆగస్టు 31న 'చలో విజయవాడ'

ప్రకాశం జిల్లా ఒంగోలులో ధర్నా చేస్తున్న ఓబులేసు, పీవీఆర్ చౌదరి, వెంకటేశ్వర్లు తదితరులు

12 గంటల పని విధానంపై
కార్మికాగ్రహం

కేంద్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాల్సిందేనని, లేనిపక్షంలో కార్మికాగ్రహం చవిచూడాల్సి వస్తుందని ఏఐటీయూసీ నేతలు హెచ్చరించారు.
2లో

విజయవాడ సామారంగ్ చౌక్‌లో ధర్నా చేస్తున్న రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య, సాంబశివరావు, నాగేశ్వరరావు, రమణారావు తదితరులు

ఇదంతా మీవల్లే..
తక్షణమే క్షమాపణ చెప్పాలి

నూపుర్ శర్మపై సుప్రీంకోర్టు ఆగ్రహం - పిటిషన్ తిరస్కృతి

న్యూదిల్లీ : ప్రవక్త మహమ్మద్‌పై బీజేపీ బహిష్కృత నాయకురాలు నూపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలు అగ్గిరాజేశాయని, పర్యవసానంగా దేశం తగలబడిపోతోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆమె నోటి దురుసుతనం వల్ల దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంది. నూపుర్ శర్మ వెంటనే దేశానికి క్షమాపణ చెప్పాలని సూచించింది. ఈ వ్యాఖ్యలను చౌకబారు ప్రచారం కోసమో లేక రాజకీయ అజెండాతోనే లేదంటే నేరపూరిత ఉద్దేశంతోనే చేసి ఉంటారని పేర్కొంది. తన వ్యాఖ్యలు రేపిన దుమారం క్రమంలో వేర్వేరు రాష్ట్రాల్లో నమోదు అయిన ఎఫ్ఐఆర్‌లను కలపేయాలన్న నూపుర్ శర్మ ఫిర్యాదును సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ప్రవక్త మహమ్మద్‌పై నూపుర్ శర్మ వ్యాఖ్యలు ఆమె అహంకారానికి అద్దం పట్టాయని, న్యాయవాదినని చెప్పుకునే ఆమెకు ఇలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏమిటి? ఆమె చేసిన పనికి దేశం తగలబడిపోతోంది. వీరు ఆధ్యాత్ములు కారు... ఇతర

- మిగతా 2 లో

నూపుర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి : ఎంపీ విశ్వం 2లో



ఒకే దేశం, రెండు వ్యవస్థల విధానానికి కట్టుబడి ఉన్నాం : జిన్‌పింగ్

బీజింగ్: ఒక దేశం, రెండు వ్యవస్థలు అన్న విధానానికి చైనా కట్టుబడి ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడించారు. ఈ ప్రాతిపదికగా హాంగ్ కాంగ్ నగరాన్ని రక్షిస్తున్నామని, ఇది సుదీర్ఘ కాలం కొనసాగుతుందని పేర్కొన్నారు. హాంగ్‌కాంగ్‌లో చైనా ఆధిపత్యాన్ని సమర్థించుకున్న జిన్‌పింగ్ బ్రిటన్ నుంచి హాంగ్‌కాంగ్‌ను చైనాకు అప్పగించి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో హాంగ్‌కాంగ్‌ను జిన్ పింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో చైనా రాజకీయ వ్యవస్థా విధానాన్ని వెల్లడించారు. రెండేళ్ల తర్వాత ఆయన స్వదేశం విడిచి బయటకు వెళ్లారు. ఒకదేశం, రెండు వ్యవస్థల వల్ల హాంగ్ కాంగ్‌కు స్వేచ్ఛ లభిస్తుందని, భావ స్వేచ్ఛను రక్షిస్తుందని, చైనాలో లేని హక్కుల్ని ఇక్కడ పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా వందలాది మంది హాంకాంగ్ యువకులు, సభ్యులు హాంకాంగ్ పోలీస్ బ్యాండ్ చేపట్టిన స్వాగత కార్యక్రమంలో జెండాలు, పువ్వులతో స్వాగతం పలికారు. చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ హాంకాంగ్ స్వదేశీయులను అభినందిస్తూ, హాంకాంగ్ మాతృభూమికి తిరిగి వచ్చిన 25వ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. హాంగ్‌కాంగ్ గురించి తాను ఎప్పటి నుంచో ఆందోళన చెందుతున్నానని నా హృదయం, ప్రభుత్వ హృదయం ఎల్లప్పుడూ హాంకాంగ్ స్వదేశీయులతోనే ఉంటాయని పేర్కొన్నారు. ప్రమాదాలు, సవాళ్లను అధిగమించి హాంకాంగ్ మరింత పటిష్టంగా ఆవిర్భవించిందన్నారు.

ఆఫ్రికా దేశాల్లో పెరుగుతున్న ద్రవ్యోల్బణం

గాబోరోన్ : దక్షిణాఫ్రికా కస్టమ్స్ యూనియన్ (ఎస్‌ఏసీయూ) దేశాలైన బోట్స్‌వానా, దక్షిణాఫ్రికా, ఈశ్వతిని, నమీబియా, లెసోతో దేశాల్లో ఆర్థిక స్తబ్దత పెరిగే ప్రమాదం ఉందని బోట్స్‌వానా అధ్యక్షుడు మోక్‌వీట్సీ మసిసి ఆందోళన వ్యక్తం చేశారు. బోట్స్‌వానా రాజధాని గాబరోన్‌లో ఎస్‌ఏసీయూ దేశాధినేతల 7వ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా మాసిసి మాట్లాడుతూ రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య కొనసాగుతున్న వివాదంతో ప్రపంచదేశాల్లో ఆర్థిక వృద్ధి మరింత దిగజారే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. 2022లో ఆర్థికవృద్ధి ఇప్పటికే 3.6 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుదల, ముఖ్యంగా ఆహార కొరతలతో ప్రస్తుత ప్రపంచం ప్రమాదంలో ఉందన్నారు. ఇది వినియోగదారుల కొనుగోలు శక్తిని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఎస్‌ఏసీయూ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను పరిపుష్టం చేసేందుకు తగిన చర్యలను చేపట్టాలని మాసిసి పిలుపునిచ్చారు. వ్యవసాయ ప్రాసెసింగ్, వస్త్రాలు, దుస్తులు, సౌందర్య సాధనాలు, ముఖ్యమైన నూనెలు, ఔషధాలలో ప్రాంతీయ విలువ గొలుసులను అభివృద్ధి చేయడం ద్వారా కస్టమ్స్ యూనియన్ ప్రాంతీయ ఆర్థిక సమగ్రతను మరింతగా పెంచడానికి ప్రయత్నిస్తుందని ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ పౌలినా ఎలాగో తెలిపారు.

పాక్‌లో ముదిరిన విద్యుత్ సంక్షోభం

మొబైల్, ఇంటర్‌నెట్ సేవల నిలిపివేత

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో విద్యుత్ సంక్షోభం తీవ్రమైంది. దీంతో మొబైల్, ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేస్తామని పాక్ జాతీయ సమాచార సాంకేతిక సంస్థ (ఎన్ఐటీబీ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా గంటల తరబడి విద్యుత్ కోతలు వెంటాడుతుండటంతో టెలికాం ఆపరేటర్ల సేవలపై ప్రభావం పడుతోందని, దీంతో మొబైల్, ఇంటర్‌నెట్ సేవలను మూసివేస్తామని టెలికాం ఆపరేటర్లు చెబుతున్నారని ఎన్ఐటీబీ ట్విట్టర్‌లో పేర్కొంది. జులైలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంటుందని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దేశ ప్రజలను ఇప్పటికే హెచ్చరించారు. దేశ అవసరాలకు సరిపడా ఎల్ఎన్‌జీ సరఫరాలు ఉండటం లేదని, ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు సంకీర్ణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. గ్యాస్ సరఫరాలకు సంబంధించిన ఒప్పందం అంగీకరించడంలో ప్రభుత్వం విఫలమవడంతో పాకిస్తాన్‌ను విద్యుత్ సంక్షోభం వెంటాడుతోంది. మరోవైపు విద్యుత్ వినిమయాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ ఉద్యోగుల పనివేళలను తగ్గించడంతో పాటు కరాచీ సహావివిధ నగరాల్లో ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్‌ను త్వరగా మూసివేయాలని పాక్ ప్రభుత్వం ఆదేశించింది. ఇక మూడేళ్ల నుంచి పదేళ్ల వరకూ ఎల్ఎన్‌జీ సరఫరాల కోసం ఖతార్‌తో ఒప్పందం చేసుకునేందుకు పాకిస్తాన్ ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని ఆర్థిక మంత్రి మిఫ్తా ఇస్మాయిల్ తెలిపారు. పాక్‌లో కాగితం కొరత తీవ్రతరం కావడంతో ఆగస్టులో ప్రారంభంకానున్న విద్యా సంవత్సరానికి పుస్తకాలు అందుబాటులో ఉండవని పేపర్ అసోసియేషన్ వెల్లడించింది. దిగుమతి చేసుకుంటున్న కాగితంపై భారీగా పన్నులు విధించడం, స్థానిక కాగితపు పరిశ్రమల గుత్తాధిపత్యం ఈ పరిస్థితికి దారితీసింది.

జగన్ సర్కార్‌కు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకోవాలని ఆదేశించింది. టికెట్ల విక్రయించిన తర్వాత థియేటర్లకు డబ్బు ఎన్ని రోజుల్లో జమ చేస్తారనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ విషయంలో ఎగ్జిబిటర్లు అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తుది తీర్పును రిజర్వ్ చేస్తూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 69 పైన స్టే ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం అమలు నిలిపేసింది. తదుపరి విచారణ ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.

అమెరికాతో చర్చలకు ఇరాన్ సిద్ధం

టెహ్రాన్ : అణు ఒప్పందంపై అమెరికాతో 'తదుపరి దశ' చర్చలకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. 2015 అణు ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి అమెరికాతో కొత్త పరోక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ పేర్కొంది. 'బంతి యుఎస్ కోర్టులో ఉంది. అమెరికా వాస్తవికంగా వ్యవహరిస్తే దాని బాధ్యతలను అమలు చేస్తే, ఒప్పందం అమలవుతుంది. ఇరాన్, యుఎస్‌ల మధ్య పరోక్ష చర్చలు ఖతార్‌లో గణనీయమైన పురోగతిని సాధించడంలో విఫలమైంది' అని ఇరాన్ రాయబారి రావంచి వ్యాఖ్యానించారు. ఖతార్ చర్చలు తీవ్రమైనవి, సానుకూలమైనవిగా అభివర్ణించారు. తదుపరి దశ చర్చల కోసం ఇరాన్ యూరోపియన్ యూనియన్ కో ఆర్డినేటర్లను సంప్రదిస్తుందన్నారు. రావంచి ఖతార్ చర్చలను "తీవ్రమైన, సానుకూల చర్యలుగా" అభివర్ణించారు.

ఇదంతా మీవల్లే..

(మొదటిపేజీ తరువాయి)

మతాలను గౌరవించరు. ముప్పు ఉన్నది ఆమెకా లేక దేశానికి ఆమెతో ముప్పు ఏర్పడిందా? దేశంలోని ప్రస్తుత దురదృష్టకర పరిస్థితులకు ఆమె ఒక్కరే కారణం. ఆమె పాల్గొన్న చర్చలను మేము చూశాం' అని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. నూపుర్ శర్మ తరపు న్యాయవాది సింగ్ వాదనలు వినిపిస్తూ ఆమె క్షమాపణ కోరారని కోర్టుకు చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం 'ఆమె చాలా ఆలశ్యంగా స్పందించారు. అదీ కాకుండా మతపరమైన మనోభావాలను కించపర్చివుంటే అంటూ షరతులతో కూడిన క్షమాపణ చెప్పారు. ఆమె వెంటనే టీవీ మాధ్యమంగా దేశానికి క్షమాపణ చెప్పి ఉండాల్సింది' అని పేర్కొంది. రాజకీయ పార్టీ అధికార ప్రతినిధిగా ఆమె అనుకోకుండా అలా మాట్లాడారని సింగ్ చెప్పగా 'మీరు ఓ పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నంత మాత్రాన నోటికొచ్చినట్లు మాట్లాడటానికి లైసెన్సు ఇచ్చినట్లు కాదు' అని న్యాయస్థానం చీవాట్లు పెట్టింది. చర్చలను దుర్వినియోగించి ఉంటే గనుక వెంటనే వ్యాఖ్యతపై ఎఫ్ఐఆర్‌ను ఆమె నమోదు చేసివుండాలని పేర్కొంది. చర్చల్లో పాల్గొన్న ఇతరుల వ్యాఖ్యలపై నూపుర్ శర్మ అలా స్పందించారన్న సింగ్ వాదనలను న్యాయస్థానం తోసిపుచ్చింది. 'టీవీలో చర్చ పెట్టింది ఎందుకు? అగ్ని (అజెండా)కు ఆజ్యం పోసేందుకా? సబ్ జుడీస్ (కోర్టు పరిధిలో ఉన్న అంశం)ని ఎందుకు ఎంచుకున్నారు? అని ప్రశ్నించింది. ఒకటే చర్యపై రెండవ ఎఫ్ఐఆర్ ఉండకూడదంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఇతర తీర్పులను సింగ్ ప్రస్తావించగా జస్టిస్ కాంత్ స్పందించారు. మరొక ఎఫ్ఐఆర్ నమోదు అయితే అందుకు ఆమె హైకోర్టును ఆశ్రయించవచ్చు అని అన్నారు. ఈ క్రమంలో అర్నబ్ గోస్వామి కేసును సింగ్ గుర్తు చేయగా 'ఒక అంశంపై తన హక్కును పాత్రికేయుడు వినియోగించుకోవడం.. రాజకీయ పార్టీ అధికార ప్రతినిధినిగా ఇతరులనుద్దేశించి నిర్లక్ష్యపూరితంగా వ్యాఖ్యలు చేయడం ఒకటి కాదని న్యాయస్థానం పేర్కొంది. దిల్లీ పోలీసుల విచారణకు సహకరిస్తున్నారని, ఆమె పారిపోవడం లేదని సింగ్ అంటే 'ఇప్పటివరకు దర్యాప్తులో జరిగింది ఏమిటి? దిల్లీ పోలీసులు ఇప్పటివరకు ఏం చేశారు? మా నోళ్లు తెరిపించొద్దు... మీకోసం ఎర్రతివాచీ పరిచివుంటారుగా' అని కోర్టు వ్యాఖ్యానించింది. దాదాపు 30 నిమిషాలు సాగిన విచారణ అనంతరం నూపుర్ శర్మ పిటిషన్‌ను తిరస్కరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది.

నూపుర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి : ఎంపీ విశ్వం

న్యూదిల్లీ : ప్రవక్త మహమ్మద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ బహిష్కృత నేత నూపుర్ శర్మకు ఎర్ర తివాచీ పరిచి బాధితుల హక్కుల కోసం పోరాడే కార్యకర్తలు తీస్తా సెతల్వాడ్, శ్రీకుమార్‌ను జైలుకు పంపడం ఎంత వరకు సమంజసమని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం ప్రశ్నించారు. ఆమె వ్యవహారంలో సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలను స్వాగతించారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం కళ్లు తెరవాలని, పద్ధతిని మార్చుకోవాలని హితవు పలికారు. ఏదేని రాజకీయ పార్టీ అధికార ప్రతినిధికి మతోన్మాదంతో కూడిన నిర్లక్ష్య వైఖరి హాల్‌మార్కు కాకూడదన్నారు. ఇటువంటి వారి వల్లే ఉదయ్‌పూర్ తరహా ఘటనలు చోటుచేసుకుంటాయని, వీరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజల్లోకి తప్పుడు సందేశం వెళుతుందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఇటువంటి వారు దేశానికి, ప్రజలకు క్షమాపణ చెప్పాలని ట్వీట్ చేశారు. బీజేపీ, ఆ పార్టీ నేతలు విద్వేషాన్ని ప్రోత్సహిస్తుండటంతో దేశాన్ని ప్రమాదంలోని నెట్టివేస్తున్నాయని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. ఇటువంటి విద్రోహ-విభజిత చర్యలకు పూనుకోబోమని బీజేపీ ప్రతిజ్ఞ బూనాలని నొక్కిచెప్పారు. ఆ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని నుపుర్ శర్మ వ్యవహారంలో సుప్రీం చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఏచూరీ ట్వీట్ చేశారు. దేశంలో చోటుచేసుకుంటున్న హింసకు నూపుర్ శర్మ కారణమని సుప్రీంకోర్టు భావిస్తే ఆమెపై చట్ట ప్రకారం చర్యలను తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి రావడంతో బీజేపీ ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసిందని, చట్టప్రకారం చర్యలు తీసుకోకపోతే ఆమె లాంటి మరికొందరు నోరు పారేసుకుంటారు. బీజేపీ/ఆర్ఎస్ఎస్ విద్వేష ఫ్యాక్టరీల నుంచి ఇంకొందరు పుట్టుకొస్తారని వ్యాఖ్యానించారు. ఆల్ట్‌న్యూస్ సహ-వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్ చిన్న కారణానికి జైలు పాలు కావడాన్ని ఖండించారు. నిజాన్ని నిర్ధారించే జుబేర్ వంటి జర్నలిస్టు జైలులో ఉండరాదు.. మరింత నిబద్ధతతో పనిచేయాలన్న ప్రోత్సాహం లభించాలి అని ఏచూరీ అన్నారు. నూపుర్ శర్మ విద్వేషపూరిత ప్రసంగాన్ని బహిర్గతం చేసినందుకే బీజేపీ పరిధిలోని పోలీసులు ఆయనను జైలుకు పంపారన్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా స్పందిస్తూ ప్రస్తుత ప్రభుత్వ విజభన వైఖరికి సుప్రీంకోర్టు వ్యాఖ్యలు అద్దం పట్టాయన్నారు.

పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను వ్యతిరేకిస్తూ

నేడు వామపక్ష పార్టీల ధర్నాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను వ్యతిరేకిస్తూ ఈనెల 2వ తేదీ శనివారం బస్‌స్టేషన్ల వద్ద ధర్నాలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి వై.సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నుంచి జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నుంచి కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి ఎన్.మూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పీవీ సుందరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు జానకీ రాములు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడ్నెళ్ల కాల పరిమితిలోనే రెండోసారి డీజిల్ సెస్ పేరుతో రూ.500కోట్ల భారం మోపుతూ, ఆర్టీసీ బస్‌చార్జీలను పెంచడాన్ని తీవ్రంగా ఖండించాయి. ప్రజల నిరసనల ఫలితంగా డీజిల్ ధరలు రూ.10 తగ్గిన తరుణంలో, డీజిల్ సెస్ పేరిట భారం మోపడం శోచనీయమన్నారు. 30 కిలోమీటర్ల పైన ప్రయాణించే ప్రయాణికులం దరిపైన రూ.10 నుంచి రూ.100 వరకు టికెట్టుకు ధర పెంచడం గర్హనీయమన్నారు. విద్యార్థుల బస్‌పాస్‌ల ధరలను ప్రభుత్వం పెంచడం అన్యాయమన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, ఇతర ధరలు విపరీతంగా పెరిగిన సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయని తెలిపారు. పెంచిన బస్‌చార్జీల నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. బస్‌స్టేషన్ల ముందు జరగనున్న ధర్నాలు, నిరసనలను విజయవంతం చేయాలని కోరారు.

కేరళ సీపీఎం రాష్ట్ర కార్యాలయంపై బాంబుదాడికి వామపక్షాల ఖండన

కేరళ సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యాలయం ఏకేజీ భవన్‌పై గత రాత్రి జరిగిన బాంబుదాడిని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు శుక్రవారం వామపక్ష పార్టీల నుంచి సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి వై.సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నుంచి జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నుంచి కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి ఎన్.మూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పీవీ సుందరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు జానకీ రాములు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఈ బాంబు దాడికి కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, ప్రజాస్వామ్య వాదులు, ప్రజలు ఈ చర్యలను ఖండించాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు.

సమాజ సేవకు ప్రతిరూపం రెడ్‌క్రాస్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సామాజిక సేవకు ప్రతిరూపంగా ఆపదలో ఉన్న వారికి అండగా రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అనుసరణీయమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విజయవాడ రాజ్ భవన్ దర్బార్ హాలులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెడ్ క్రాస్ శ్రీకాకుళం శాఖ చైర్మన్ పి.జగన్మోహనరావుకు భారత ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రశంసా పత్రాన్ని గవర్నర్ బహుంకరించారు. మరోవైపు రెడ్ క్రాస్ సభ్యత్వం విషయంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నందుకుగాను ఏపీ రెడ్ క్రాస్ సొసైటీ తరపున అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి ఏకే ఫరీదాలకు రాష్ట్రపతి అవార్డు, ప్రశంసా పత్రాలను అందించారు. 15 ఏళ్లకు పైబడి గణనీయమైన సేవలు అందించిన వారికి దక్కే అరుదైన గౌరవం జగన్మోహనరావుకు దక్కడం మంచి పరిణామమని ఈ సందర్భంగా గవర్నర్ హరిచందన్ అన్నారు. ఇటీవల న్యూదిల్లీ వేదికగా నిర్వహించిన భారత రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశంలో రాష్ట్రపతి బంగారు పతకం, ప్రశంసా పత్రం అవార్డుల కోసం ఈ ఎంపికలు చేశారని శ్రీధర్ రెడ్డి తెలిపారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, సంయుక్త కార్యదర్శి సన్యాసి రావు, రాజ్‌భవన్ అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయం కోసం వడ్డే విరాళం

నెల్లూరు జిల్లా పల్లెపాడులో రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణలో ఉన్న కొనకా కనకమ్మ ఆశ్రమంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు కోసం మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు తదితరులు గవర్నర్ చేతుల మీదుగా విరాళం అందించారు. వ్యక్తిగతంగా వడ్డే రూ.25వేలు, మక్కెన అంకయ్య చౌదరి రూ.25వేలు సమకూర్చారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీధర్ రెడ్డి, ఏకే ఫరీదా, బీఎస్ఎన్ రెడ్డి, రంగయ్య నాయిడు, గూడూరు లక్ష్మి పాల్గొన్నారు. ఆశ్రమానికి చెందిన భూమి అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రతినిధులు గవర్నర్‌ను కోరారు.

47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 47 మంది మున్సిపల్ కమిషనర్లకు బదిలీలు, నియామకాలు ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీలు, పదోన్నతలు పొందిన వారిలో గ్రేడ్-1, 2, 3 విభాగాల మున్సిపల్ కమిషనర్లున్నారు. వెయింటింగ్ లిస్ట్‌లో ఉన్న వారికి నియామకాలు, మరికొందరికి బదిలీలు చేపట్టారు. గుంటూరుకు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కె.వసంతలక్ష్మిని విజయవాడ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. విశాఖకు చెందిన పి.ప్రేమ ప్రసన్నకు బొబ్బిలి అర్బన్ డవలప్‌మెంట్ అధికారిగా నియమించారు. విశాఖ జీవీఎంసీకి చెందిన సీహెచ్.శాంతకుమారిని శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ అధికారిగా నియమించారు. విశాఖకు చెందిన సీహెచ్.తిరుమలరావును ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అధికారిగా, వెయిటింగ్‌లో ఉన్న పి.భవానీ ప్రసాద్‌ను జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. రాజమండ్రి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ అధికారిగా జి.స్వర్ణకుమార్‌ను, ఎ.వెంకటరావును కాకినాడ అర్బన్ డవలప్‌మెంట్ అధికారిగా నియమించారు. జి.రవిని మెప్మా-గుంటూరుకు బదిలీ చేశారు. కె.వెంకటరెడ్డిని పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా, కెఎల్ఎం రెడ్డిని డోన్ మున్సిపాల్టీకి బదిలీ చేశారు. సి.రవిచంద్రారెడ్డిని నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా, పి.ప్రమీలా రాణిని మదనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. చిత్తూరు తుడాకు చెందిన పి.శ్రీహరిబాబును కదిరి మున్సిపాల్టీకి బదిలీ చేశారు. కర్నూలుకు చెందిన ఎన్.వెంకటేశ్వర్లును డోన్‌కు గుంటూరు కార్పొషన్‌కు చెందిన డి.నీరజారెడ్డిని ఒంగోలుకు బదిలీ చేశారు. నందికొట్కూరుకు చెందిన ఎస్.బేబి, గుంటూరు మున్సిపల్ కమిషనర్ పి.నిరంజన్‌రెడ్డి తదితరులు బదిలీ అయ్యారు.

కార్మికాగ్రహం

- రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు
- లేబర్‌కోడ్‌లు ఉపసంహరించుకోవాల్సిందే !
- కార్మికవర్గాన్ని కట్టు బానిసలు చేస్తున్న మోదీ
- చట్టాలు రద్దు చేయకుంటే పతనం తప్పదని ఓబులేసు, రవీంద్రనాథ్ హెచ్చరిక

తిరుపతి కలెక్టరేట్ ఎదుట ధర్నాలో హరినాథరెడ్డి, పెంచలయ్య, మురళీ, రాధాకృష్ణ, రవి, కుమార్‌రెడ్డి తదితరులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

కేంద్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాల్సిందేనని, లేనిపక్షంలో కార్మికాగ్రహం చవిచూడాల్సి వస్తుందని ఏఐటీయూసీ నేతలు హెచ్చరించారు. జులై 1 నుంచి దేశవ్యాప్తంగా 12 గంటల పని విధానాన్ని అమలు జరపాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు భారీ నిరసన ప్రదర్శనలు, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలులో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు, విజయవాడలో అధ్యక్షులు రవీంద్రనాథ్, గుంటూరులో గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నూజివీడులో జరిగిన ధర్నాలో కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు పాల్గొన్నారు. విజయవాడ వన్‌టౌన్ సామారంగం చౌక్‌లో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు మూలి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం సంస్కరణలపేరుతో కార్మిక చట్టాలను కార్పొరేట్ వర్గాలకు, పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేసిందన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు మార్చి కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. 8 గంటల పనివిధానం పెట్టుబడిదారీ వర్గ దయాదాక్షిణ్యాలపై వచ్చింది కాదని, కార్మికులు రక్తాతర్పణం చేసి పోరాటాల ద్వారా సాధించుకున్నారని గుర్తు చేశారు. కేంద్ర నిరంకుశ విధానాలను బీజేపీయేతర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం నరేంద్రమోదీ మెప్పు పొందటం కోసం ఈ చట్టాలు అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికైనా మోదీ, జగన్ ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేనిపక్షంలో కార్మికాగ్రహం చవిచూడాల్సి వస్తుందని రవీంద్రనాథ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య, ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వియ్యపు నాగేశ్వరరావు, రాష్ట్ర హాకర్స్ యూనియన్ అధ్యక్షులు కొట్టురమణ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో

కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగులేబర్ కోడ్‌లు తక్షణమే నిలుపుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఓబులేసు డిమాండ్ చేశారు. 12 గంటల పని విధానం, 4 లేబర్ కోడ్‌ల రద్దును డిమాండ్ చేస్తూ ఒంగోలులో బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగులు, కార్మికుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్ కోడ్‌లుగా తేవడం దుర్మార్గమన్నారు. కార్మికులను కట్టుబానిసలుగా చేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయించడానికి కుట్రపన్నిందన్నారు. రైతు చట్టాలు ఉప సంహరించినట్లుగానే 4 లేబర్ కోడ్‌లను ఉప సంహరించుకోవాలని డిమాండు చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వీవీఆర్ చౌదరి, నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో నాలుగుకోడ్‌ల ప్రతులను దగ్ధం చేస్తున్న కోటేశ్వరరావు, రమేశ్, దుర్గ తదితరులు

గుంటూరులో

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గుంటూరులో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. స్థానిక మల్లయ్యలింగంభవన్ నుంచి పెద్దఎత్తున నినాదాల మధ్య ప్రదర్శన హిమనీ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికుల శ్రమను అంబానీ, ఆదానీలకు తాకట్టు పెట్టవద్దని, కార్పొరేట్ కంపెనీలకు కార్మికులను కట్టుబానిసలుగా మార్చవద్దని, 12 గంటల పనివిధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, కోట మాల్యాద్రి, కోశాధికారి ముఠా కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ(బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో

కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. కార్మిక కోడ్‌లకు నిరసనగా శుక్రవారం స్థానిక పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్, స్థానిక కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో జీవో ప్రతులు దగ్ధం

పారిశ్రామిక కేంద్రమైన ఇబ్రహీంపట్నంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన కార్మికులు ప్రదర్శన చేసి, నాలుగు లేబర్ కోడ్‌లకు సంబంధించిన జీఓ ప్రతులను తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి బుడ్డి రమేష్, శ్రామిక మహిళా ఫారం జిల్లా నాయకురాలు సిహెచ్.దుర్గాకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో

కార్మిక వర్గాన్ని కట్టు బానిసలు చేస్తున్న మోడీ పాలన అరాచకంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. 12 గంటల పని దినాలు వద్దు 8 గంటల పని దినాలు కొనసాగించాలని కోరుతూ, శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్.డీ.రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ , జిల్లా అధ్యక్షుడు కె.కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాలో

ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బాపట్ల జిల్లా రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ బాపట్ల కార్యదర్శి పి.నాగాంజనేయులు, రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, పడమట భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై జల్లి విల్సన్, అజయ్‌బాబు, మురళీకృష్ణ, మధు. మహాసభకు హాజరైన వారిలో ఒక భాగం.

దేశ రాజకీయాల్లో ప్రమాదకర పరిస్థితి

- ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేస్తున్న మోదీ సర్కారు
- 2024లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు
- 31మంది ఎంపీలు ఉన్నా ప్రత్యేక హోదా సాధనలో వైసీపీ విఫలం
- రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతున్న జగన్
- పాలకుల దుర్మార్గపు విధానాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- సీపీఐ జాతీయ మహాసభల జయప్రదానికి సహకరించాలి
- సీపీఐ విశాలాంధ్ర శాఖ మహాసభలో రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ : దేశ రాజకీయాల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పాలకులు అనుసరిస్తున్న దుర్మార్గపు విధానాలు, వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి చైతన్యపరచాల్సిన బాధ్యత విశాలాంధ్రపై ఉందని చెప్పారు. సీపీఐ విశాలాంధ్ర శాఖ మహాసభ శుక్రవారం చంద్రం బిల్డింగ్స్‌లో విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఎం.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా కె.రామకృష్ణ, గౌరవ అతిథిగా విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ హాజరయ్యారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ అన్ని రంగాలపై కరోనా ప్రభావం తీవ్రంగా పడిందని, లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారని, ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందని, కోట్లాది మంది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోయారన్నారు. సామ్రాజ్యవాద దేశాలు కరోనాను ఎదుర్కోవడంలో విఫలమయ్యాయని చెప్పారు. చైనా, క్యూబా, వియత్నాం వంటి కమ్యూనిస్టు దేశాలు కరోనాను కట్టడి చేయడంలో విజయం సాధించాయని, ఆయా దేశాల్లో విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. భారతదేశంలో కరోనాను ఎదుర్కొనే విషయంలో మోదీ ప్రభుత్వం అశాస్త్రీయ విధానాలతో ప్రజల ప్రాణాలను బలితీసుకుందని విమర్శించారు. కేంద్రంలో రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బహిరంగంగా ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేస్తోందని, ఇందులో భాగంగానే జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దు చేశారని, అయోధ్యలో రామాలయం నిర్మాణం చేపట్టారని, ముస్లింలను ద్వితీయ పౌరులుగా పరిగణించేందుకు ఎన్నార్సీ, సీఏఏ తీసుకొచ్చారని, ఉమ్మడి పౌరస్మృతి అమలు కోసం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం ఏకంగా స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించి ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు హెగ్డేవార్ జీవితాన్ని పాఠంగా చేర్చడం బీజేపీ దుర్మార్గపు చర్యలకు పరాకాష్ట అని అన్నారు. బీజేపీ నాయకులు మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ 2024లో బీజేపీ అధికారంలోకి వస్తే ఏకంగా రాజ్యాంగాన్ని కూడా మార్చివేస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. ఒకవైపు దేశంలోని సాధారణ ప్రజలు, రైతులు, కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పెరిగిపోతున్నాయని, మరోవైపు కార్పొరేట్ల ఆస్తులు పెరిగిపోతున్నాయని, ఇందుకు మోదీ పాలనే కారణమని చెప్పారు. రాష్ట్రంలో తనకు 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా మెడలు వంచి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధిస్తానని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు 22 మంది లోక్‌సభ సభ్యులు, 9 మంది రాజ్యసభ సభ్యులు కలిపి 31 మంది ఉన్నా కనీసం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవడం లేదన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ ఓట్లు కీలకమని తెలిసినా కూడా ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేయకుండా బేషరతుగా బీజేపీకి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులపై విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ జాతీయ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సీపీఐ జాతీయ మహాసభల జయప్రదానికి విశాలాంధ్ర సీపీఐ శాఖ, ఎంప్లాయీస్ యూనియన్, ఉద్యోగులు తమవంతు సహకారం అందించాలని కోరారు. కూన అజయ్‌బాబు మాట్లాడుతూ విశాలాంధ్ర జర్నలిస్టులకు కమ్యూనిస్టు పార్టీ దృక్పథం ఉండాలని, అది వార్తల్లో ప్రతిబింబించాలనే లక్ష్యంతో సీపీఐ శాఖ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శాఖ ద్వారా జర్నలిస్టులకు నిరంతరం రాజకీయ చైతన్యం కల్పించాల్సి ఉందన్నారు. తొలుత సంతాప తీర్మానాన్ని చావా రవి ప్రవేశపెట్టారు. సీపీఐ విశాలాంధ్ర శాఖ కార్యదర్శి పి.మధుసూధనరావు కార్యదర్శి నివేదికను సమర్పించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గేయాలు ఆలపించారు.

నూతన కమిటీ ఎన్నిక : సీపీఐ విశాలాంధ్ర శాఖ కార్యదర్శిగా పి.మధుసూదనరావు, సహాయ కార్యదర్శిగా వి.రమేశ్, కార్యవర్గ సభ్యులుగా ఎం.మురళీకృష్ణ, ఎస్‌కే సూర్యనారాయణ, ఎం.బొర్రయ్య, కె.వెంకటస్వామి, ఎం.రామారావు, ఇ.రొమిలా, టి.యోగితను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

జీవో 117 ప్రకారమే రేషనలైజేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయుల బదిలీలు నిమిత్తం జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు-117 ప్రకారం రేషనలైజేషన్ ప్రక్రియ ప్రకారం రాష్ట్రమంతటా బదిలీల విధానం అమలు చేస్తున్నట్లు పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం కేటగిరీల వారీగా ఎన్ని ఉద్యోగ పోస్టులు అదనంగా అవసరత కలిగి ఉంటుందో వాటి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామన్నారు. ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి బదిలీ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌ద్వారా పారదర్శకంగా జరుగుతుందని, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు.

పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: దేవినేని ఉమా మహేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పోలవరం పనులపై శ్వేతపత్రం విడుదలచేసే దమ్ము ఉందా? అని మాజీమంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్ల శ్వేతపత్రం కూడా విడుదల చేయాలన్నారు. పోలవరం నియోజకవర్గంలో వైసీపీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు కలిసి పోలవరం నిర్వాసితుల డబ్బులలో అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. రంపచోడవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి నిరాహార దీక్ష చేసినా పట్టించుకోలేదన్నారు. మంత్రి అంబటి రాంబాబు చంద్రబాబును విమర్శించకుండా పోలవరం పనులపై స్పందించాలని డిమాండ్ చేశారు. అంబటి తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయనీ, తెలివి తక్కువతనంగా మాట్లాడొద్దని సూచించారు.

మాట్లాడుతున్న ముప్పాళ్ల. వేదికపై ఈవీ నాయుడు, రవీంద్రనాథ్, శ్రీనివాస్, శేషకుమార్ తదితరులు

మరో సమరానికి సన్నద్ధం

- ఆగస్టు 31న 'చలో విజయవాడ'
- అగ్రిగోల్డ్ బాధితులకు సీఎం హామీ నిలబెట్టుకోవాలి
- అసోసియేషన్ రాష్ట్ర సదస్సు డిమాండ్
- 25న పాత, ఆగస్టు 1న కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు
- స్పందనలో కలెక్టర్లకు విజ్ఞాపనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులకు ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడ దాసరి భవన్‌లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవీ నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు సదస్సును ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో మిగిలిపోయిన 10 లక్షల అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు సత్వరమే డిపాజిట్ చెల్లించాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు. జగన్ గతంలో పాదయాత్ర సందర్భంగా, బాధితుల దీక్షా శిబిరంలోనూ ప్రతిపక్ష నాయకుని హోదాలో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లిస్తామని ఎన్నికల ముందు చెప్పి, మూడేళ్లుగా నోరు మెదపకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. మాట తప్పను, మడమ తిప్పను అని పదేపదే పేర్కొన్న జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రూ.20 వేల లోపు పేద డిపాజిట్ దారులకు డబ్బు చెల్లిస్తామని ప్రకటించి, దానిని మరిచిపోయారని అన్నారు. అయితే గత జులైలో అసోసియేషన్ చేసిన పెద్ద పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చి ఆగస్టు 24న రూ.667 కోట్లు చెల్లించారన్నారు. రూ.20 వేల లోపు ఉన్న మరో మూడున్నర లక్షల మందికి, రూ.20 వేల పైన ఉన్న ఆరున్నర లక్షల మందికి సీఎం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే చెల్లింపులకు ఆదేశం చాలని ముప్పాళ్ల విజ్ఞప్తి చేశారు. జులై, ఆగస్టు లోపు డబ్బు చెల్లించకపోతే మరో భారీ సమరానికి సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు మాట్లాడుతూ రూ.లక్షన్నర కోట్లు ఉచితంగా పంపిణీ చేశామంటూ ఆర్భాటంగా పేర్కొనే సీఎంకు, తన మాటను నమ్మి ఓట్లేసి గెలుపునకు కృషి చేసిన అగ్రిగోల్డ్ బాధితులు గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం... అటు ప్రభుత్వాన్ని, ఇటు ఏజెంట్లను, కస్టమర్లను, మరో వైపు కోర్టునూ దగా కోరు మాటలతో మోసగిస్తున్నారన్నారు. తమ పోరాట ఫలితంగా పెద్ద సంఖ్యలో ఆత్మహత్యలను తగ్గించగలిగామన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు ఈవీ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా కంపెనీలు డిపాజిట్లు సేకరించి ప్రజలను మోసగిస్తే, తమ అసోసియేషన్ ప్రజా, న్యాయ పోరాటాల ద్వారా ఎన్నో విజయాలు సాధించిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో మరణించిన 142 కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇప్పించామని వివరించారు. ఆగస్టులో సుమారు 10 లక్షల మంది చిన్న డిపాజిట్ దారులకు రూ.667 కోట్లు ఇప్పించగలిగామన్నారు. ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంకా మిగిలి ఉన్న 10 లక్షల మంది బాధిత కుటుంబాలకు చెందిన 40 లక్షల మంది ప్రజలకు పూర్తి న్యాయం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీఎం ఈనెల 8,9 తేదీల్లో జరిగే వైసీపీ ప్లీనరీ సమావేశాల్లో బాధితులకు ఇవ్వాల్సిన, రూ.3,043 కోట్లను ఎప్పుడు, ఎలా చెల్లింపులు చేయనున్నారో స్పష్టమైన ప్రకటన చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈనెల 20 లోపు స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి రాకుంటే, జులై 25న పాత, ఆగస్టు 1 తేదీలలో కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించి, స్పందనలో కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు ఇస్తామన్నారు. ఆగస్టు 31న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. సదస్సులో అసోసియేషన్ నేతలు శేషకుమార్‌రెడ్డి, సిద్దేశ్వర్, బీవీ శ్రీనివాస్, నాగలక్ష్మి, ఆరేలమ్మ, లోవరత్నం, అంజనాదేవి, మల్లిఖార్జున్, మంగరాజు, సూరప్పడు, జగన్‌మోహన్, గగన్, మంత్రునాయక్, ఆగస్త్యన్ తదితరులు ప్రసంగించారు. 26 జిల్లాల నుంచి 250 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలను ఆలపించారు.

ఆమోదించిన తీర్మానాలివీ : వైఎస్ జగన్ 2017 మార్చి 23న అగ్రిగోల్డ్ బాధితుల నిరవధిక దీక్షా శిబిరానికి వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేసిన సందర్భంగా బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ఇచ్చిన మాటను ఈ ఏడాది జులై 8,9 తేదీలలో జరగనున్న వైసీపీ రాష్ట్ర ప్లీనరీ సమావేశంలో అమలు చేసేందుకు తగిన కార్యాచరణను ప్రకటించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సు తీర్మానించింది. రాష్ట్రంలోని పేదలకు వివిధ పథకాల కింద దాదాపు లక్షన్నర కోట్ల రూపాయలను మూడేళ్లలో ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడాన్ని అసోసియేషన్ అభినందిస్తూ, అగ్రిగోల్డ్ బాధితులకు ఉచితవరం అవసరం లేదని పేర్కొంది. ఆర్నెళ్లు అన్న సీఎం హామీని, మూడేళ్ల అనంతరమైనా నెరవేర్చి యుద్ధ ప్రాతిపదికన బాధితులను ఆదుకోవాలని సదస్సు తీర్మానించింది.

మోదీ మరో రూథర్ ఫర్డ్

ఏపీలో పర్యటించే హక్కు ఆయనకు ఉందా ?

అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు బాలకోటయ్య ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రధాన నరేంద్ర మోడీకి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే అర్హత ఉందా? అని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీ విభజనలో తల్లిని చంపి బిడ్డను బతికించారు అన్న మోడీ మాటల్లో ఎంత నిజం ఉందో తెలియదు కానీ, అల్లూరి సీతారామరాజును రూథర్ ఫర్డ్ చెట్టుకు కట్టి కాల్చినట్లు ఆంధ్రప్రదేశ్ విభజన హక్కుల్ని, ప్రత్యేక హోదాను మోదీ కాల్చేశారని మండిపడ్డారు. ఏపీకి మోదీ మరో రూథర్ ఫర్డ్ లాంటివారని బాలకోటయ్య అభివర్ణించారు. విభజనలో గాయపడ్డ రాష్ట్రానికి హోదా, రాజధాని నిధులు, పోలవరం, వెనుక పడ్డ ప్యాకేజీ వంటి హక్కులతో ఆదుకుంటామని చెప్పి అన్నింటికీ మంగళం పాడారన్నారు. 22 మంది ఎంపీలను ఇస్తే, కేంద్రం కాలర్ పట్టుకుని హోదా తెస్తామన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మోదీ కాళ్ళు బాగా పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్రాన్ని నిలదీసే అవకాశం వచ్చినా వైసీపీ చేజార్చుకుందన్నారు. ప్రత్యేక ప్యాకేజీని పాచిపోయిన లడ్డు అన్న జనసేన పార్టీ బీజేపీతో అంటకాగుతూ హోదాను విస్మరించిందన్నారు. రాజకీయ ఉరితాళ్ళతోహోదాను ఉరితీసిన ప్రధానమంత్రి ఏపీ కొచ్చి ఏం సందేశం ఇస్తారని ప్రశ్నించారు. అల్లూరి వంటి మన్యం వీరుని సభలో ఏ స్ఫూర్తి నింపుతారని నిలదీశారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం ప్రాజెక్టు, దళితులపై దాడులు వంటి అంశాలపై రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపై మోదీ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ఉద్యమకారులు ప్రధాని మోడీ పర్యటనపై నిరసన తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలకోటయ్య పిలుపునిచ్చారు.

రఘురామ విషయంలో చట్టబద్ధంగా నడుచుకోవాలి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నర్సాపురం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు విషయంలో చట్టబద్ధంగా నడుచుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. జూలై 4వ తేదీన ప్రధాని మోదీ భీమవరం పర్యటనలో తాను కూడా పాల్గొంటున్నానని, తనకు రక్షణ కల్పించాలని ఎంపీ శుక్రవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటీషన్ దాఖలు చేశారు. రఘురామ రాజు తరుపున న్యాయవాది ఉమేష్‌చంద్ర వాదనలు వినిపించారు. ఆనియోజకవర్గ ప్రజా ప్రతినిధిగా హాజరు కావచ్చు కదా ? అని కోర్టు ప్రశ్నించగా, రఘురామరాజును కేసులు పెట్టి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పిటీషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే కేంద్రం రఘురామరాజుకు వై క్యాటగిరి భద్రత కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. జూలై 3, 4 తేదీల్లో ఒకవేళ పోలీసులు రఘురామపై కేసులు నమోదు చేస్తే..న్యాయ, చట్టబద్ధ ప్రక్రియను అనుసరించాలని కోర్టు ఆదేశించింది. కేసులు పెట్టి వెంటనే అరెస్ట్ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

ఏబీవీపై సస్పెన్షన్ ఎత్తివేయాలి: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తివేసి, తన విధులు నిర్వర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వత్తాసు పలకని అధికారులపై వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. ముఖ్యంగా సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావుపై గతంలో సస్పెన్షన్ వేటు వేసి, రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురి చేసిందన్నారు. కోర్టు తీర్పు తదుపరి ఆయనకు పోస్టింగ్ ఇచ్చిన కొద్ది రోజుల్లోనే మరోసారి సస్పెన్షన్ వేటు వేయడం దుర్మార్గమని ఖండించారు. జగన్ తనకు, తన అనుయాయులకు ఒక నిబంధన, ఇతరులకు మరో నిబంధన వర్తింపచేస్తున్నారని మండిపడ్డారు. అధికారులను మానసికంగా వేధిస్తూ, వ్యవస్థలపై దాడి చేస్తున్నారు. ప్రజాస్వామిక వ్యవస్థలో ఇలాంటి కక్షపూరిత చర్యలు దురదృష్టకరమని ఖండించారు. జగన్ సర్కార్ కోర్టు తీర్పులను సైతం లెక్క చేయక సీనియర్ అధికారులపై దుందుడుకు చర్యలు చేపట్టడం వల్ల ప్రభుత్వ యంత్రాంగంలో అభద్రతాభావం నెలకొనే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో వ్యవస్థలపై నమ్మకాన్ని, నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం, బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతో ఉందనీ, తక్షణమే ఏబీ వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ను ఎత్తివేసి, ఆయనను విధుల్లో కొనసాగించాలని కోరారు.

సహకార బ్యాంకింగ్ రంగంలో

రెండంచెల విధానం అమలుకు 4న ధర్నా

విజయవాడ తరలిరావాలని అసోసియేషన్ నేత రవికుమార్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సహకార బ్యాంకింగ్ రంగంలో రెండంచెల విధానం అమలు చేయాలని కోరుతూ ఈనెల 4వతేదీ విజయవాడలో భారీస్థాయిలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి 13 జిల్లాల సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు, సహకార సంఘాల ఉద్యోగులు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కేవీఎస్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సహకార బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం ఉన్న మూడంచెల స్థానంలో (రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు) రెండంచెల విధానం ప్రవేశ పెడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులను రాష్ట్ర సహకార బ్యాంకుల్లో విలీనం చేయడం ద్వారా ప్రతి అంచలో ఉండే పరిపాలనా వ్యయం తగ్గి రైతాంగానికి తక్కువ వడ్డీకి పంట రుణాలు అందడంతోపాటు, రాష్ట్రవ్యాపితంగా ఒకే రకమైన సహకార విధానాలు అమలవుతాయన్నారు. అలాగే రాష్ట్రస్థాయి పాలకవర్గం ఆజమాయిషీతో బ్యాంకు శాఖల వ్యాపార విస్తీర్ణం వేగవంతం చెందవచ్చునని, ప్రస్తుత బ్యాంకింగ్ రంగంతో పోటీపడే విధంగా సాంకేతికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే గత రెండు దశాబ్దాలుగా అసోసియేషన్ పోరాటాలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగానే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచేందుకు ఈనెల 4వ తేదీ విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు.

ఏజెన్సీలో 10కేజీల బియ్యం ఇవ్వాలి

ఏపీ ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏజెన్సీ ఏరియాలో ప్రజలు ఆహారంగా బియ్యాన్నే వినియోగిస్తున్నందున వారికి ఇకపై మనిషికి 5 కేజీలు కాకుండా 10 కేజీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాపరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం బియ్యం కేజీ రూ.38.50 లకు కొని కార్డుదారులకు రూ1.00కు సరఫరా చేస్తున్నారు. కావున కార్డు దారులు వాటిని బయట అమ్ముకోకుండా సక్రమంగా వినియోగించుకునేలా చూడాలని సూచించారు. విజయనగరం, మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో బలవర్థకమైన బియ్యాన్ని మధ్యాహ్న భోజనం, అంగన్ వాడి కేంద్రాలకు, రైస్ కార్డు దారులకు సరఫరా చేస్తున్నారు. ఏజెన్సీ ఏరియాలోని చౌకధర దుకాణాలకు నిత్యావసర సరుకులు సకాలంలో సరఫరా జరగకపోవటంతో అక్కడి లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు, కావున ఏజెన్సీ ఏరియాలో బఫర్ గోడౌన్స్ ఏర్పాటు చేసి కందిపప్పు, పంచదార సకాలంలో సరఫరా చేయాలని ఆదేశించారు. వీటిపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు యన్.విజయ కుమార్, జి.కృష్ణమ్మ, యల్.బి.వెంకట్రావు, యన్.శ్రీనివాసరావు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు. పక్కన మంతెన సీతారాం, బాబూరావు

11న కలెక్టరేట్ల వద్ద ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ప్రజలపై పడుతున్న భారాలకు నిరసనగా ఈ నెల 11వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, మంతెన సీతారాంతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంస్కరణల అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయన్నారు. విద్యుత్, పెట్రోలు, డీజిల్, కొత్తగా బస్సు ఛార్జీలు బాదుడుకు అడ్డూ, అదుపు లేకుండా పోయిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్ను, ఆస్తి విలువ పేరుతో అదనపు భారాలు పెరిగాయని చెప్పారు. కొత్తగా జీఎస్టీ బాదుడు పెరిగిందని, రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయాన్ని కేంద్రం తన్నుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వాలు నోరెత్తకపోవడం సరికాదన్నారు. గతంలో ఒడిస్సాలో బీజేపీ తరుపున రెండుసార్లు మంత్రిగా ఉండి, గిరిజనులను పోలీసులు కాల్చిచంపినా నోరెత్తలేదని, అటవీ హక్కులు కాలరాస్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన హోదా, విభజన హామీలు నెరవేర్చినందుకు మద్దతు ఇస్తున్నారా? అనేదీ వైసీపీ స్పష్టం చేయాలన్నారు. పార్టీలకతీతంగా హోదా కావాలని కోరుతుంటే, వైసీపీ మాత్రం దానిపై ప్రశ్నించకుండా, మద్దతుఇవ్వడం ఏమిటని నిలదీశారు. టీడీపీ సైతం దీనిపై ఇంతవరకు స్పష్టమైన ప్రకటన చేయలేదని, ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే బీజేపీకి మద్దతు ఇవ్వొద్దని కోరారు. స్వాతంత్రోద్యమ ద్రోహి బీజేపీ అని విమర్శించారు. రాష్ట్రంలో వలంటీర్లతో వైసీపీ నాయకులు ప్రజలను భయపెడుతున్నారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను నిలిపేస్తున్నారని, కేసులు పెడతామని బెదిరిస్తున్నారని విమర్శించారు.



శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాములవారి మఠం

కందిమల్లాయపల్లె గ్రామము, బ్రహ్మంగారి మఠం మండలం, కడపజిల్లా

e-Procurement Tender

NIT No. Q/COE/362/2022 Dt. 29-04-2022

ముఖద్వారము, వంట గది కమ్ డైనింగ్ హాల్, ప్రాకారము, గోకులము, విఐపి కాటేజీ, డార్మిటరీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, తాత్కాలిక కళ్యాణకట్ట మొదలగు నిర్మాణ పనుల నిమిత్తం e-Procurement Tender ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లు వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు,

బ్రహ్మంగారి మఠం

తేది: 01-07-2022

ఫిట్ పర్సన్,సహాయ కమిషనర్

సెల్ నెం: 9491000681

సంపాదకీయం

ఇక జార్ఖండ్ మీదే బీజేపీ గురి

రాష్ట్రాలతో సహా దేశమంతటా తమ ఏకచ్ఛత్రాధిపత్యమే కొనసాగాలన్నది బీజేపీ ఆకాంక్ష. అందుకే ఇతర పార్టీలు అధికారంలో ఉన్న ఒక్కో రాష్ట్రంలో ప్రభుత్వాలను పడగొట్టే పనిలో బీజేపీ నిమగ్నమై ఉంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని మహా వికాస్ అగాఢీ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అన్ని రకాల అక్రమ మార్గాలు అనుసరించిన బీజేపీ ఇప్పుడు జార్ఖండ్ ప్రభుత్వాన్ని అస్థిరీకరించే పనిలో పడింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ ప్రతిపక్షాల ఐక్యతను కాదని రాష్ట్రపతి ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతు ప్రకటించారు. జార్ఖండ్‌లో అసలు కుట్ర నిజస్వరూపం బయటపడలేదు కాని ఏదో జరుగుతోందని మాత్రం స్పష్టంగానే కనిపిస్తోంది. హేమంత్ సొరేన్‌ను ఇరుకున పెట్టడానికి బీజేపీ తనకు బాగా అలవాటైన కుయుక్తులన్నింటినీ ప్రయోగిస్తోంది. ఏదో ఓ మాయోపాయంతో ఇతర పార్టీలు అధికారంలో ఉన్న చోట ఆ ప్రభుత్వాలను కూల్చేసే పనిలో బీజేపీ ఉంది. జార్ఖండ్, రాజస్థాన్‌లో ప్రభుత్వాలను అస్థిరీకరించడానికి వ్యూహాలు పన్నుతోంది. స్వతంత్రంగా వ్యవహరించవలసిన కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థలను ఇదివరకే మోదీ సర్కారు గుప్పెట్లో పెట్టుకుంది. తమకు కిట్టని నాయకుల మీద సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, ఆదాయపు పన్ను శాఖను ఉసిగొల్పడం కొనసాగుతూనే ఉంది. జార్ఖండ్‌లో మాత్రం సొరేన్ ప్రభుత్వానికి పొగబెట్టడానికి ఎన్నికల కమిషన్‌నే ఉసి గొల్పుతోంది. దానికి తోడు సొరేన్ అధీనంలో పనిచేసే అధికారుల మీద ఈ పాటికే గనుల కేటాయింపు అంశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఒక అధికారిని ఇప్పటికే అరెస్టు చేశారు. ఆయన దగ్గర రూ. 19 కోట్లు పట్టుబడ్డాయంటున్నారు. ముందు అధికారుల మీద గురిపెట్టి హేమంత్ సొరేన్‌కు ఊపిరి సలపకుండా చేయాలన్న వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. హేమంత్ సొరేన్ గనుల తవ్వకానికి తనకు తానే అనుమతి ఇచ్చుకున్నాడన్న ఆరోపణ ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ గనుల తవ్వకం విషయంలో అధికారుల మీద కూడా గురి పెట్టింది. జార్ఖండ్‌లో మాత్రమే కాకుండా పొరుగున ఉన్న బెంగాల్, బిహార్ రాష్ట్రాలలో కూడా దాడులు కొనసాగాయి. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణ కూడా హేమంత్ సొరేన్ మీద మోపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ దాడులు జరిగిన వెంటనే దాడులకు గురైన వారి దగ్గర ఏమేం దొరికాయో ఆ విభాగం అధికారులు వెల్లడించడానికి ముందే బీజేపీ నాయకులు పూసగుచ్చినట్టు ఏమేం జరిగిందో మీడియా వారికి వివరించడం పరిపాటి అయింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ముఖ్యమంత్రి సొరేన్ బంధువుల, ఒక శాసనసభ్యుడి ఇంటిమీద జరిపిన దాడుల వివరాలను బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే పొల్లుబోకుండా వివరించారు. అంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ తమ పని విధానం గురించి కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు వివరించడం మానేసి స్థానిక బీజేపీ నాయకులకు సకల వివరాలూ తెలియజేస్తున్నట్టుగా ఉంది. హేమంత్ సొరేన్ గనుల శాఖను నిర్వహిస్తున్నారు కనక గనుల తవ్వకానికి తనకు తానే అనుమతి మంజూరు చేసుకున్నారన్న ప్రచారం జరుగుతోంది.

రాజకీయ ప్రత్యర్థుల మీద కక్ష తీర్చుకోవడానికో లేదా ప్రతిపక్షంలో బలమైన నాయకులో, వారికి అనువైనవారో ఉన్నారనుకుంటే వారి మీద సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, ఆదాయపు పన్ను శాఖ చేత దాడులు చేయించి బెదరగొట్టడం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. ఈ దాడులకు గురైన వారిలో చాలామంది ఎందుకొచ్చిన గొడవ అని బీజేపీలో చేరిపోతున్నారు. అవినీతో, మరో రకమైన ఆరోపణలు ఎదుర్కుంటున్న వారు ఈ రచ్చ నుంచి బయట పడడానికి బీజేపీలో చేరి పవిత్ర గంగా స్నానం చేసి పునీతులవుతున్నారు. అలాంటి వారి మీద తక్షణ దాడులు ఆగిపోవడం చూస్తే తమ అధీనంలోని రాజ్యాంగ వ్యవస్థలను మోదీ సర్కారు ఎలా దుర్వినియోగం చేస్తోందో స్పష్టం అవుతోంది. ఇలా ఒత్తిడి తీసుకొచ్చినందువల్లే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ రాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్న ద్రౌపది ముర్ముకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. అదేమంటే తమది గిరిజనులు ఎక్కువగా ఉండే రాష్ట్రం అనీ ముర్ము గిరిజనురాలు కనక మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు నమ్మబలుకుతున్నారు. విచిత్రం ఏమిటంటే జార్ఖండ్‌లో జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, రాష్ట్రీయ జనతా దళ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ (ఎం.ఎల్.) లిబరేషన్‌తో సహా మరి కొన్ని పార్టీలు కలిసి ఏర్పాటు చేసిన ఐక్య సంఘటనకు నాయకుడు హేమంత్ సొరేనే. కానీ ఆయన ఇప్పుడు హఠాత్తుగా ప్లేటు ఫిరాయించారు. ఈ ఐక్య సంఘటన 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏర్పడింది. 2024 ఎన్నికల నాటికి ప్రతిపక్షాల ఐక్య సంఘటనను భగ్నం చేయడానికి సొరేన్ కనక సహకరిస్తే ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగడానికి బీజేపీ అధినాయకత్వ ఆశీస్సులు ఉంటాయి లేదా బీజేపీయే ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. అవసరమైతే హేమంత్ సొరేన్ ప్రభుత్వాన్ని అస్థిరీకరించడం పెద్ద కష్టమేమీ కాదు. ఎందుకంటే 81 మంది శాసనసభ్యులున్న జార్ఖండ్‌లో జార్ఖండ్ ముక్తి మోర్చాకు 30 స్థానాలే ఉన్నాయి. బీజేపీ సభ్యులు 25 మంది ఉన్నారు. ప్రస్తుతం ఉన్న మహా సంఘటనకు 51 మంది సభ్యుల మద్దతు ఉంటే ఎన్.డి.ఎ.కు 30 మంది మద్దతు ఉంది. మహా సంఘటన విచ్ఛిన్నమైతే సొరేన్ నిలబడలేరు. అప్పుడు రాష్ట్రపతి పాలన విధిస్తే అధికారం బీజేపీ గుప్పెట్లో ఉన్నట్టే. జార్ఖండ్‌లో 14 లోకసభ స్థానాలు ఉంటే బీజేపీకి 11 మంది సభ్యులున్నారు. మహా కూటమిని ధ్వంసం చేయగలిగితే 2024 ఎన్నికలలో మొత్తం 14 సీట్లూ బీజేపీ ఖాతాలో పడ్డా ఆశ్చర్యపోనక్కర్లేదు.

అధికారం సంపాదించడానికి అనుసరించే పద్ధతి నైతికమా, అనైతికమా అన్న పట్టింపు బీజేపీకి ఎటూ లేదు. అందువల్ల బీజేపీ ఇక జార్ఖండ్ మీద గురి పెట్టే అవకాశాలు ఉన్నాయి. మెజారిటీ లేని చోట్ల కూడా ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలో బీజేపీ అసమానమైన నైపుణ్యం సాధించింది. అందు కోసం ఎలాంటి మార్గం అనుసరిస్తాం అన్న దానితో బీజేపీకి పేచీయే లేదు. అనుసరించే మార్గం కన్నా అధికారం సంపాదించడమే ప్రధానం. కర్నాటక, మధ్యప్రదేశ్, గోవా లాంటి చోట్ల అనుసరించిన పద్ధతి అనుసరించడానికి బీజేపీ ఎన్నడూ వెనుకాడదు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అని నినదించిన బీజేపీ ఇప్పుడు అసలు ప్రతిపక్షమే లేకుండా చేయడం మీదే దృష్టి కేంద్రీకరించింది. దానికి ఎన్ని అడ్డదార్లైనా తొక్కడానికి సిద్ధమే. రాజ్యాంగాన్ని కాలరాసే ప్రక్రియలో ఇప్పటికే నైపుణ్యం సంపాదించింది కనక ఇక ఎదురేముంటుంది!

బహుళ జాతి సంస్థల భూ దురాక్రమణ!

బొల్లిముంత సాంబశివరావు

అనేక ఆఫ్రికా దేశాల్లో వచ్చిపడే విదేశీ పెట్టుబడుల ప్రవాహం గురించి ప్రచారం చేశారే తప్ప దాని ప్రమాదం ఆ దేశాల పాలకులకు పట్టలేదు. ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు అనుమతించరాని పెట్టుబడిదారుల ప్రతిప్రాదనలకు ఎటువంటి సమీక్ష లేకుండా ఆమోదం తెలిపాయి. కాంబోడియా, సూడాన్, కాంగో, ఘనా మొదలైన దేశాలు భూ కేటాయింపుల్లో సరిహద్దులను కూడా విస్మరించాయి. పాలకుల విధానాల ఫలితంగా ఆఫ్రికా దేశాల్లోని అత్యధిక భూములు బడా పెట్టుబడిదారుల ఆధీనంలోకి వెళ్లాయి. భూములు కోల్పోయి, ఉపాధి కరువై తీవ్ర సంక్షోభంలో ఉన్న అనేక దేశాల్లోని పేదలు, రైతులు పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభించారు. విదేశీ పెట్టుబడిదారుల ఆధీనంలో ఉన్న తమ భూములు తిరిగి ఇవ్వాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, బహుళ జాతి సంస్థలపై ఆంక్షలు విధించాలని ప్రభుత్వాలను వారు డిమాండ్ చేస్తున్నారు.

బహుళ జాతి సంస్థల కన్ను నేడు పేద దేశాల వ్యవసాయ భూములపై పడింది. కొన్ని అరబ్ దేశాలు కూడా ముందుముందు ఏర్పడనున్న ఆహార సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని పెద్దఎత్తున భూ కొనుగోళ్లు చేస్తున్నాయి. ఎక్కువగా ఆఫ్రికా దేశాల రైతుల భూములు పరాయికరణ చెందుతున్నాయి. ఈ దేశాల్లో భూ హక్కులు కలిగిన రైతులు చాలా తక్కువగా (2 నుండి 10 శాతం) ఉండటం, భూమి హక్కుకు ఆచార వ్యవస్థలు సరిపోతాయని భావించటం, జాతీయ విధానం విధిగా ప్రభుత్వ యాజమాన్యం కలిగి ఉండటం అందుకు కారణంగా ఉంది. సామ్రాజ్యవాదానికి, బహుళ జాతి సంస్థలకు లొంగిన ప్రభుత్వాలు తమ స్వాధీనంలో ఉన్న భూములను అమ్మటం లేదా లీజుకు ఇవ్వటం ద్వారా భూములు బహుళ జాతి సంస్థల పరమౌతున్నాయి. వెనకబడిన వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తామని, ఆసుపత్రులు, స్కూల్స్, రోడ్లు ఏర్పాటు చేస్తామని, పంట ద్వారా లభించే ఆదాయంలో వాటా ఇస్తామని రైతాంగానికి భ్రమలు కల్పించి బహుళజాతి సంస్థలు మోసంచేస్తూ వారి భూములు లాక్కొంటున్నాయి.

భవిష్యత్తులో ఆహారం, ఇంధన కొరత సమస్యను దృష్టిలో పెట్టుకుని వాటి వ్యాపారం కోసం పెద్దఎత్తున భూ సేకరణకు పూనుకున్నాయి. 2007-08 ప్రపంచ ఆహార ధరల సంక్షోభం తర్వాత భారీ ఎత్తున భూ సేకరణను బహుళ జాతి సంస్థలు చేపట్టాయి. భూ సేకరణ అంటే ఇక్కడ దేశవిదేశీ సంస్థలు, ప్రభుత్వాలు, వ్యక్తులు పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేయటం లేదా లీజుకి తీసుకోవటం. ఈ పద్ధతుల్లోనే లక్షల ఎకరాల భూములను బహుళ జాతి సంస్థలు కాజేశాయి. ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (IFPRI) 2009 అంచనా ప్రకారం వెనకబడిన దేశాల్లో 15 నుండి 20 మిలియన్ల హెక్టార్ల వ్యవసాయ భూమి 2006 నుండి చేతులు మారింది. 2013 జనవరి నాటికి ల్యాండ్ పోర్టల్ సంస్థ ల్యాండ్ మ్యాట్రిక్ డేటా ప్రకారం 49 మిలియన్ హెక్టార్ల భూములకు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. 2011 ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 56 మిలియన్ హెక్టార్ల కోసం విక్రయ ఒప్పందాలు జరిగాయి. సూడాన్‌లోని అమెరికా కంపెనీలు ఆర్క్ క్యాప్, నైల్ ట్రేడింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంక్ మధ్య ఒక మిలియన్ హెక్టార్ల భూమిని తీసుకున్నాయి. చైనా కొలంబియా మధ్య నాలుగు లక్షల హెక్టార్ల ఒప్పందం జరిగింది. టాంజానియాలో 3,25,000 హెక్టార్లకు బహుళ జాతి సంస్థలు పెట్టుబడులు ఉన్నాయి. యుఎఇ.. పాకిస్థాన్‌లో 3,24,000 హెక్టార్ల భూమి కొనుగోలు చేసింది.

ప్రభుత్వ ఆధీనంలోని భూములను విదేశీ ప్రభుత్వాలకు, బహుళ జాతి సంస్థలకు ఇస్తున్న లీజు చెల్లింపు వైనం ఎంతో హాస్యాస్పదంగా ఉంది. సౌదీ అరేబియా యువరాజు బందర్ బిన్ సుల్తాన్ 1,05,000 హెక్టార్లకు సంవత్సరానికి లీజు రూపంలో చెల్లించేది 1,25,000 అమెరికా డాలర్లు. ఇది హెక్టారుకు ఒక డాలర్‌కి కొంచెం ఎక్కువ. పెరూలోని దక్షిణ కొరియా పెట్టుబడిదారులు హెక్టారుకు 0.80 డాలర్ మాత్రమే లీజు చెల్లిస్తున్నారు. ఇథియోపియాలో భారతీయ బడా పెట్టుబడిదారులు కొనే హెక్టారు ధర 3,11,000 కాగా, సంవత్సర లీజు 1.20 నుండి 8 డాలర్లు. టాంజానియాలో 3 లక్షల హెక్టార్లలో పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం 1000 హెక్టార్లలో పని చేస్తున్నాయి. గాబన్‌లో ఓలమ్ ఇంటర్నేషనల్ పెట్టుబడి 3 లక్షల హెక్టార్లలో ఉంటే ప్రస్తుతం 59 వేల హెక్టార్లలో పని జరుగుతున్నది. నైజీరియాలో మూడు సంస్థల పెట్టుబడులు 6 లక్షల ఎకరాలు. ఈక్వటోరియల్ పామ్ ఆయిల్ ఒప్పందం 1,69,000 వేల హెక్టార్లు. 2020 నాటికి 50 వేల హెక్టార్లలో పని మొదలు పెట్టాలని ప్రణాళికలు వేసింది.

యూరోపియన్ యూనియన్ దేశాలు, ఇతర అనేక దేశాల్లో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడ్డాయి. ఇయు ల్యాండ్ మ్యాట్రిక్స్ డేటా 2016 ప్రకారం ఈ దేశాల భూ ఆక్రమణలు ఇతర దేశాల్లో ఈ విధంగా ఉన్నాయి (భూములు హెక్టార్లలో) యునైటెడ్ కింగ్‌డమ్ 19,72,000, ఫ్రాన్స్ 6,29,953, ఇటలీ 6,15,674, ఫిన్లాండ్ 5,66,558, పోర్చుగల్ 5,03,953, నెదర్లాండ్స్ 4,14,974, జర్మనీ 3,09,566, బెల్జియం 2,51,808, లక్సెంబర్గ్ 1,57,914, స్పెయిన్ 1,36,504, రొమేనియా 1,30,000, స్వీడన్ 77,329, డెన్మార్క్ 31,460, ఆస్ట్రియా 21,000, ఎస్టోనియా 18,800 హెక్టార్ల భూములు ఆక్రమణ చేశాయి. తమ ఆధీనమైన భూముల్లో చెరకు, పామాయిల్, జీవ ఇంధనాలు, తమకు అవసరమైన ఆహార పంటలు ఉత్పత్తులకు బహుళ జాతి సంస్థల, విదేశీ బడా పెట్టుబడిదారుల ప్రాధాన్యతగా ఇవ్వటం వలన ఆఫ్రికా దేశాల్లోని సాంప్రదాయ పంటలకు ప్రజలు దూరమయ్యారు. దీనితో పాటు సంస్కృతి మూలాలు ప్రమాదంలో పడుతున్నాయి.

వివిధ దేశాల ప్రజా వ్యతిరేక పాలకులు విదేశీ సంస్థలకు భూములు ఏ విధంగా కట్టపెడుతున్నదీ లీజు కాలం, అందుకు చెల్లించే మొత్తం తెలియ చేస్తున్నది. అలా భూములు కట్టబెట్టినందుకు ఆ దేశాల పాలకులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందాయి. పాలకుల విధానాల వలన, బహుళ జాతి సంస్థల మోసపు మాటలు నమ్మిన స్థానిక రైతులు భూములు కోల్పోయి జీవనోపాధి సమస్యను ఎదుర్కొంటున్నారు. భూములకు ఇచ్చే పరిహారం మార్గదర్శకాల వల్ల రైతాంగం తీవ్ర అన్యాయానికి గురైయ్యారు. ఇథియోపియా, ఘనా దేశాల్లో రైతులకు ఇచ్చిన పరిహారం వారి జీవనోపాధి పునరుద్ధరణకు ఏ మాత్రం సరిపడలేదని అధ్యయనాలు నిర్ధారించాయి. రసాయనిక ఎరువుల వలన భూసారం తగ్గి భూములు నిస్సారమౌతున్నాయి.

భూములను వదులుకున్న రైతులు, వారి భూముల్లోనే కూలీలుగా మారారు. ఫలితంగా వారి కుటుంబాలు తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. భూములు ఉన్న పెట్టుబడిదారులు స్థానిక ప్రజలను వ్యవసాయ ప్లాంట్లలో పెద్ద సంఖ్యలో కూలీలుగా నియమించుకున్నారు. ఉద్యోగ కల్పనకు ఇచ్చిన హామీలో అతి తక్కువ ఉపాధి కల్పన మాత్రమే జరిగింది. కూలి కూడా అతి తక్కువగా ఉంది. ఇథియోపియాలోని కరుటూరి గ్లోబల్ పెట్టుబడిలో కూలీల రోజు కూలి రెండు డాలర్లు. ఈ కూలీతో వారి కుటుంబ అవసరాలు తీరక దుర్భర పరిస్థితుల్లో కూరుకుపోయారు.

అనేక ఆఫ్రికా దేశాల్లో వచ్చిపడే విదేశీ పెట్టుబడుల ప్రవాహం గురించి ప్రచారం చేశారే తప్ప దాని ప్రమాదం ఆ దేశాల పాలకులకు పట్టలేదు. ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు అనుమతించరాని పెట్టుబడిదారుల ప్రతిప్రాదనలకు ఎటువంటి సమీక్ష లేకుండా ఆమోదం తెలిపాయి. కాంబోడియా, సూడాన్, కాంగో, ఘనా మొదలైన దేశాలు భూ కేటాయింపుల్లో సరిహద్దులను కూడా విస్మరించాయి. పాలకుల విధానాల ఫలితంగా ఆఫ్రికా దేశాల్లోని అత్యధిక భూములు బడా పెట్టుబడిదారుల ఆధీనంలోకి వెళ్లాయి. భూములు కోల్పోయి, ఉపాధి కరువై తీవ్ర సంక్షోభంలో ఉన్న అనేక దేశాల్లోని పేదలు, రైతులు పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభించారు. విదేశీ పెట్టుబడిదారుల ఆధీనంలో ఉన్న తమ భూములు తిరిగి ఇవ్వాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, బహుళ జాతి సంస్థలపై ఆంక్షలు విధించాలని ప్రభుత్వాలను వారు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాస రచయిత సెల్
9885983526

కొవిడ్ గోరుచుట్టపై యుద్ధం రోకటి పోటు!

బి.ఎం.ఆర్

శరీరానికి ఏదో ఒక భాగంలో ముల్లు గుచ్చుకున్నపుడు దేహమంతా బాధ ఉంటుంది. అలాగే ప్రపంచంలో నేడు ఏ మూలన యుద్ధం జరిగినా ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలు కావడంతో పాటు నిత్యావసరాల ధరలు పెరగడం వెంటనే కనిపిస్తున్నది. ఉక్రెయిన్ రష్యా యుద్ధ విధ్వంసం నాలుగు మాసాలుగా కొనసాగుతోంది. కోవిడ్ దెబ్బ నుండి తేరుకుంటున్న వేళ 'గోరు చుట్టుపై రోకలి పోటులా' ఈ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల ప్రభావాలకు ప్రత్యక్ష కారణం అవుతున్నది. ఈ యుద్ధంతో ఉక్రెయిన్ పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు రష్యాపై పలు దేశాల ఆంక్షల నడుమ ఆ దేశ ఆర్థిక స్థితి 30 ఏండ్లు వెనక్కి వెళ్ళిందని అంచనా. ఉక్రెయిన్ జనావాసాలు పేక మేడల్లా కూలిపోతున్నాయి. పరిశ్రమలు బాంబులతో పేలి పోతున్నాయి. సామాన్య జనులు హాహాకారాలు చేస్తున్నారు. ఆవాసాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ప్రధాన కేంద్రాలు భస్మీపటలం అవుతున్నాయి. జనాలు పిట్టల్లా రాలుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24 న ప్రారంభమైన యుద్ధం భీకరంగా జరుగుతోంది. ఈ యుద్ధం ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థల మీదా తిరోగమన ప్రభావాన్ని చూపిస్తున్నది.

గోధుమల ధర 14 ఏళ్ళ తార స్థాయికి

యుద్ధంతో ప్రపంచ దేశాల అభివృద్ధి మందగమనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మార్కెట్ సరఫరాలు విచ్ఛిన్నం కావడం, చమురు ధరలు చుక్కల్ని తాకడం, నిత్యవసరాల ధరలు సామాన్యుడికి చెమటలు పట్టించడం లాంటి ప్రతికూల ప్రభావాలు అనుభవంలోకి వస్తున్నాయి. ప్రపంచ దేశాల అభివృద్ధి 4.5 శాతం నుంచి 3 శాతానికి పడిపోవడం, పలు దేశాల ద్రవ్యోల్బణం దాదాపు రెట్టింపు కావడంతో అసమానతల అగాధం పెరుగుతూ ప్రమాదకరంగా మారుతోంది. 2008 తరవాత గోధుమల ధరలు నేడు అత్యధిక స్థాయికి పెరిగాయి. ప్రపంచ దేశాల్లో మొక్కజొన్న, గోధుమలు, బార్లీ ఎగుమతుల్లో ఉక్రెయిన్ 4వ అతి పెద్ద దేశంగా, సన్‌ఫ్లవర్ ఆయిల్ ఎగుమతుల్లో ప్రథమ స్థానంలో ఉండేది. ఉక్రెయిన్, రష్యాలు కలిసి ప్రపంచ గోధుమల అవసరాలను 27 శాతం తీరుస్తున్నాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్/నూనె గింజల సరఫరాలో 53 శాతం ఉన్నాయి.

యుద్ధం కారణంగా ఈ పరిస్థితి తారుమారవుతోంది.

ఆకలి చావుల అంచున

నేడు కొనసాగుతున్న యుద్ధంతో ప్రపంచ మానవాళి చూడని ఆహార సంక్షోభం అంచున నిలిచింది. యుద్ధ నేపథ్యంలో గోధుమల ఎగుమతులు ఆగిపోవడంతో యెమెన్, అఫ్గానిస్థాన్, తూర్పు ఆఫ్రికా దేశాలు ఆకలి చావుల దుస్థితిని అనుభవిస్తున్నాయి. యుద్ధంతో సతమతం అవుతున్న ఉక్రెయిన్ ఈ ఏడాది వ్యవసాయం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడంతో ఆ దేశంతో పాటు పలు దేశాలు ఆహార కొరతలోకి జారనున్నాయి. ఆఫ్రికాకు చెందిన ఈజిప్ట్ లాంటి 25కు పైగా దేశాలు దాదాపు 50 శాతం వరకు గోధుమలకు ఉక్రెయిన్, రష్యాల మీదనే ఆధారపడడం అనాదిగా ఉంది. ఐరాస నివేదిక ప్రకారం 24 ఏళ్ళ తరవాత ఈ ఫిబ్రవరిలో 'ప్రపంచ ఆహార ధరల సూచీ' అతిగా పెరిగింది. ఉక్రెయిన్‌ను ఆక్రమించే క్రమంలో రష్యా బలగాలు ఓడ రేవులను కూడా ఆక్రమించుకోవడంతో ఆహార ధాన్యాల సరఫరా ఆగిపోవడం లేదా తగ్గిపోవడం జరిగింది. యుద్ధం కారణంగా రెండు దేశాల్లో వ్యవసాయ, ఆహార ఆధార ఉత్పత్తుల ధరలు పెరగడంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, పంపిణీ శృంఖలాలు తెగిపోవడంతో సాగుబడి కుంటుపడింది.

ప్రపంచ జనాభాలో 30 శాతం పేదరికం ఉచ్చులో

ఈ జనవరిలో రోజుకు 11.3 బ్యారెల్స్ ముడి చమురును ఉత్పత్తి చేసిన రష్యా చమురు ఉత్పత్తుల్లో అమెరికా, సౌదీల తర్వాత 3వ స్థానంలో, సహజ వాయువు ఉత్పత్తిలో 2వ స్థానంలో ఉండేది. క్రూడ్ ఆయిల్ ఎగుమతుల్లో రష్యా 2వ స్థానంలో ఉండడం గత చరిత్రగా మిగిలింది. నేటి యుద్ధంతో ప్రపంచ జనాభాలో 30 శాతం పేదరిక ఉచ్చులో పడడమే కాకుండా రోజుకు 40 మిలియన్ల బడుగులు దారిద్ర్యరేఖకు దిగువన చేరుతున్నారు. యుద్ధ పరిణామాల్లో 8.3 మిలియన్ల వరకు ఉక్రెయిన్ శరణార్థుల సమస్య, ఆంక్షల అగాధాలు, నిత్యావసరాల ధరలతో విశ్వ మానవాళి తీవ్ర సంక్షోభంలో పడింది. ఆహార కొరత, గృహ సమస్య, రవాణా, విద్య, నగదు అందుబాటు లాంటి చాలా సమస్యలు ఉక్రెయిన్‌ను వెన్నాడుతున్నాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో పాతాళానికి దిగజారుతున్నది. ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తుల్లో రష్యా ముందు వరుసలో ఉండేది. శ్రీలంకలో యుద్ధ ప్రభావం అత్యధికంగా పడింది. గోధుమ ఉత్పత్తిలో ఇండియా 2వ స్థానంలో ఉండగా నేడు యుద్ధ సమయంలో ఎగుమతులు కుంటుపడడం చూస్తున్నాం.

వాతావరణ ప్రతికూల మార్పులు

యుద్ధ ప్రభావం వాతావరణ మార్పులపై తీవ్రంగా పడడం విచారకరం. అమెరికా, యూరోప్, నాటో దేశాలు రష్యాపై కఠిన ఆంక్షలు విధించినా ఇండియా మాత్రం రష్యాపై ఆంక్షలు విధించకుండా రష్యా నుంచి చమురు, ఆయుధాలు లాంటివి దిగుమతి చేసుకుంటున్నది. రష్యా దాడిని భారత్ వ్యతిరేకించకపోయినా సామాన్యుల మరణాలను వ్యతిరేకిస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక అణు ఆయుధాలను కలిగిన తొలి దేశంగా రష్యా నిలుస్తున్నది. యుద్ధంలో అతిగా దెబ్బ తింటున్న ఉక్రెయిన్‌తో పాటు రష్యా కూడా అపార నష్టాలను చవిచూస్తున్నది. రష్యాను ఏకాకిని చేసే ప్రయత్నంలో భాగంగా తీవ్ర ఆంక్షలు విధించిన వేళ రష్యా ఆర్థిక సంక్షోభంలో మునిగిపోతున్నది. యుద్ధ సమయంలో మిలిటరీ అత్యధిక శిలాజ ఇంధనాలను వినియోగించడంతో భూతాపంపై అధిక ప్రభావం పడనున్నది. ఈ యుద్ధంతో కనీసం 25 దేశాలు ప్రతికూల వాతావరణ మార్పులకు లోనుకానున్నాయి.

వ్యాస రచయిత సెల్ 9949700037

ఉందిలే మంచి కాలం ముందుముందునా...

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

కోపం వస్తుంది. చదువుతున్న దినపత్రికని చింపేయాలనిపిస్తుంది. టీవీ చూస్తూంటాం కదా... కొన్ని వార్తలు వింటూంటే... టీవీ మీదకి చేతిలో ఉన్న కాఫీ కప్పు విసిరేయాలనిపిస్తుంది. కాని, మధ్య తరగతి మానవులం కదా... అసహనంగా ఓ నిట్టూర్పుతో కోపాన్ని దాచేసుకుంటాం. రెండు నెలల ఈఎంఐ కట్టలేదని అపురూపంగా కొనుక్కున్న స్కూటరో, కారో ఫైనాన్స్ చేసిన బ్యాంక్ వాడు పట్టుకుపోతానని వస్తాడు. లేదూ ఎన్నాళ్లుగానో కంటున్న కలని నిజం చేసుకుందుకు అపార్ట్‌మెంట్‌లో ఓ పిచ్చుకుల గూడునీ అప్పు చేసి కొంటాం. నాలుగైదు వాయిదాలకే ఆ కలని చెరిపేసేందుకు టక్ చేసుకుని, ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడే ఓ మధ్య వయసు మానవుడు పొద్దునే ఇంటి ముంగిట వాలిపోతాడు. ఇదిగో ఇలాంటప్పుడే బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలు అప్పులుగా తీసుకుని విదేశాలకు పారిపోయిన వారి వార్తలు చదివి, టీవీల్లో చూస్తున్న వాళ్లకి అసహనం కట్టలు తెంచుకుంటుంది. కాని నిస్సహాయులం కదా.... మధ్యతరగతిని భుజాల మీద మోస్తున్న వాళ్లం కదా... కోపాన్ని భార్యాపిల్లల మీదో, ఆఫీసులో పై అధికారి మీదో, రోడ్డు మధ్యలో బండి ఆపేసి అది లేదు, ఇది లేదు అంటూ ఫైన్ కట్టమని గద్దిస్తున్న ఖాకీ బట్టలాయన మీదో కసురుకుంటాం. ఇలా సంవత్సరాలుగా గడిచిపోతోంది. దేశం వెలిగిపోతోందనే ప్రకటనల మధ్యలో తల పెట్టుకుని భోరున విలవిల్లాడిపోతాం. ఇంతకంటే ఇంకేం చేయలేమా అని దిగులు పడతాం. చుట్టూ మనలాంటి వాళ్లే లక్షలాది మంది ఉన్నా మనం ఒంటిరి వాళ్లంగానే మిగిలిపోతాం.

కోట్లు కొల్లగొట్టిన వాళ్లు రాత్రికి రాత్రే విమానాల్లో విదేశాలకు ఎగిరిపోతారు. దేశంలో అన్ని వ్యవస్థలూ చక్కగా పని చేస్తున్నాయని ప్రకటించే ఏలికలకు తెలియకుండానే వాళ్లంతా ఎలా ఎగిరిపోతున్నారో చిలకజోస్యం అడిగి తెలుసుకోవాలే తప్ప నిజాలు బయటకు రావు. ఇక్కడ దేశంలో అప్పులు కట్టలేక, ఆకలి తీర్చుకోలేక నిత్యం వందలాది మంది నిస్సహాయులు ఆత్మహత్యలు చేసుకుంటారు. ఇది కూడా ఎలా జరిగిందో, ఎందుకు జరుగుతోందో ఏలికలకు తెలిసినట్లుగా సామాన్యులకు తెలియదు. ఇప్పుడు కూడా దేశం వెలిగిపోతుందనే ప్రకటనలు వెల్లువెత్తుతాయి.

ఇంత ఆవేదనలోనూ ఎక్కడో మినుకు మినుకుమంటూ ఆశల దీపం కనిపిస్తుంది. అప్పుడెప్పుడో వంద సంవత్సరాల క్రితం దక్షిణాఫ్రికాలో రైల్లోంచి బయటకు గెంటేసిన మహాత్ముడు గుర్తుకు వస్తారు. నాలుగొందల సంవత్సరాలు తిష్ట వేసుకుని కూర్చున్న బ్రిటీష్ వాళ్లని దేశం నుంచి తరిమేసిన ఆ బోసినవ్వులాయన కళ్ల ముందు సాక్షాత్కరిస్తాడు. ఇక్కడి మన కష్టాన్ని దోచుకుని విదేశాలకు పారిపోయిన వాళ్లని తిరిగి వెనక్కి తీసుకురావాలంటూ ఓ ఆడ కూతురు పోలీసుల్ని నిలదీసిన వైనం వైరల్ అవుతూంటే మళ్లీ ఆశల పల్లకి కళ్లముందు కనపడుతుంది. మహాత్ముడు సాధించిన విజయం నాటి పరిస్థితులు నేడు లేకపోవచ్చు.

కాని ఆ ముంబయి ఆడకూతురు ప్రేమలతా భన్సాలీ చూపిన తెగువ గురించి తెలుసుకుంటే ఏమో మంచి రోజులు వస్తాయేమో.... అందుకు మనమంతా మళ్లీ ఏకం కావాల్సిన సమయం వచ్చిందేమో అనే నమ్మకం పెరుగుతుంది. ఇంతకీ ముంబయి మాత ప్రేమలతా భన్సాలీ ఏం చేసింది. నిరసనలు చేసిందా..... ఆందోళనలకు నాయకత్వం వహించిందా. ఆమరణ దీక్షకు కూర్చుందా. ఇవేవీ చేయలేదు. 12 గంటల పాటు ముంబయి రైల్వే పోలీసులకు చుక్కలు చూపించింది. తాను నివాసం ఉంటున్న భులేశ్వర్ నుంచి సబ్ అర్బన్ రైలులో ప్రయాణించిన ప్రేమలతా భన్సాలీ రైలు వెళ్లిపోతుందన్న హడావుడిలో టిక్కట్ తీసుకోలేదు. ఇది నేరమే. కాని ఆపద్ధర్మ నేరంగానే దీన్ని పరిగణించాలి. రైల్వే అధికారులు ప్రేమలతా భన్సాలీ టిక్కట్ లేని ప్రయాణం చేసిందన్న కారణంగా అక్షరాల 260 రూపాయలు ఫైన్ అదే అపరాధ రుసుం కట్టాలన్నారు. ఇదిగో ఇక్కడే ప్రేమలతా భన్సాలీలోని మధ్యతరగతి కోపం కట్టలు తెంచుకుంది. ఆగ్రహం వచ్చింది. మన వ్యవస్థ మీద అసహనం కూడా వచ్చిందేమో. ఇన్ని కారణాలతో ఆ తల్లి "ఫైన్ కట్టను కాక కట్టను అంది. అంతే కాదు.. బ్యాంకులను ముంచి విదేశాలకు వెళ్లిపోయిన విజయ్ మాల్యాని వెనక్కి తీసుకొచ్చి అతగాడు ఎగొట్టిన డబ్బులు తిరిగి కట్టించ" మంది. అప్పుడే తాను కూడా తన టిక్కట్ తీయని అపరాధానికి ఫైన్ కడతానని భీష్మించుకుంది. రైల్వేఅధికారులు ఎంత చెప్పినా... "జైలుకైనా వెళ్తాను కాని ఫైన్ కట్టను కాక కట్టనంది." ఇలా ఒకటి కాదు... రెండు కాదు... 12 గంటల పాటు తన నిరసన వ్యక్తం చేసింది. చివరికి లాభం లేదనుకుని రైల్వే అధికారులు ప్రేమలతా భన్సాలీ భర్త రమేష్ భన్సాలీని తీసుకువచ్చి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అదీ విఫలమైంది. "ఈ విషయంలో ప్రేమలత ముందు నేను అశక్తుడ్ని. అంతేకాదు... ఓ భర్తగా ఆమెకే నా మద్దతు" అని కూడా రమేష్ భన్సాలీ తేల్చేశారు. 12 గంటల సుదీర్ఘ పోరాటం తర్వాత రైల్వే అధికారులు ప్రేమలతా భన్సాలీని కోర్టుకు అప్పగించారు. అక్కడా ఆ తల్లి తన పట్టుని వీడలేదు. ఇక చేసేది ఏమీ లేక... కోర్టు కూడా మిన్నకుండిపోయింది.

ఇది పైకి చూడడానికి చాలా చిన్న విషయమే. కొందరు బుద్ధిజీవులైతే "260 రూపాయలే కదా... కట్టేయక ఈ గొడవ ఎందుకూ" అంటూ సన్నాయినొక్కులు నొక్కవచ్చు. కాని ఇదంత తేలిక వ్యవహారం కాదు. ఈ వివాదం, ప్రేమలతా భన్సాలీ పట్టుదల సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అంటే అగ్గి పుట్టిందన్న మాట. నిప్పు రాజుకోవడమే తరువాయి.... మిగిలినవన్నీ చకచకా జరిగిపోతాయి. బ్రిటీష్ వారి మీద అగ్గి రగిలింది దక్షిణాఫ్రికాలోనే కదా..... మన రాష్ట్రంలో మద్యం నిషేధంపై జ్వాల రగిలింది అతి చిన్న పల్లెటూరైన నెల్లూరు జిల్లా దూబగుంటలోనే కదా..... ఎక్కడో నక్సల్బరిలో పుట్టిన ఉద్యమమే కదా ఇప్పుడు ఏలికలకు సవాల్‌గా మారింది. 1960ల్లో పుట్టిన తెలంగాణ ఉద్యమమే కదా. 40 ఏళ్ల తర్వాత సాకారమైంది. ప్రపంచంలోని ఏ ఉద్యమమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభం అవుతుంది కదా... ఏమో... దేశాన్ని కొల్లగొట్టిన వారిని ఇక్కడికి తిరిగి రప్పించి ముక్కుపిండి డబ్బులు కక్కించేందుకు ప్రేమలతా భన్సాలీ వేసిన అడుగే తొలి అడుగేమో... నాకైతే అలాగే అనిపిస్తోంది. మీకు అలాగే అనిపించాలి. అనిపిస్తుంది కూడా.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్,
9912019929

ఐ-మెయిల్

ఉడత ఊపునకే కరెంటు తీగలు తెగుతాయా!

గురువారం ధర్మవరం దగ్గర ఉడత కరెంట్ తీగలను ఊపినందున అవి తెగి ఆటో మీద పడి, మంటలు రేగి ఐదుగురు మహిళలు చనిపోయారని విద్యుత్ శాఖ వారు ప్రకటించారు. నిజమే ఎలుకలు బ్రాందీ షాపుల్లో దూరి బ్రాందీ తాగినందున బ్రాందీ నిల్వలు తగ్గుతున్నపుడు, ఎలుకలు స్టీల్ ఖార్కానాల్లో దూరి స్టీల్‌ను తినగా లేనిది ఉడత కరెంటు తీగలను ఊపలేదా! అసలు కరెంటు తీగలలో నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? కొంతకాలం తరవాత పాత తీగలు తీసేసి కొత్తవి వెయ్యాలి. ఇప్పుడు తెగిన తీగలు వేసి ఎన్నేళ్ళు అయింది?అయినా కరెంటు తీగల మీద కోతులు, కాకులు దాదాపు నిత్యం తిరుగుతుంటాయి. కరెంటు షాక్ తగిలినప్పుడు అవి చచ్చిపోతాయి. అంతేకాని తీగలు తెగిపడవు. కరెంటు స్తంభాలు బిగించేటప్పుడు, గుంట తీసి, స్తంభం నిలబెట్టి, చుట్టూ కాంక్రీటు వెయ్యాలి. ఆ పని చెయ్యటం లేదు. చిన్నచిన్న గాలులకు పొలాలలో కరెంటు స్తంభాలు ఒరిగి పోవటమో, పడిపోవటమో తరచూ జరుగుతోంది. ఇందుకు కారణం స్తంభాలకు కాంక్రీటు వెయ్యకపోవటమే. ఇలాంటి కక్కుర్తి పనుల వలన వర్షాలు పడినప్పుడల్లా కరెంటు స్తంభాలు పడిపోవటం, షాక్ తగిలి జనం చనిపోతున్నారు. ఈ ఉడత కబుర్లు తప్పించుకోవటానికి చెప్పేవే. కరెంటు రేట్లు విపరీతంగా పెంచారు. కనీసం క్వాలిటీ అయినా చూడవలసిన అవసరం లేదా! అంతేకాదు ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా సరే తమ బాధ్యతలను సరిగా నిర్వర్తిస్తున్నారా? లక్షలు లక్షల ప్రజాధనం జీతాలుగా తీసుకుంటున్న ఉద్యోగులు చట్టాలను విస్మరించి, మమ్మల్ని ఎవరు ఏమి చేస్తారులే అన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు. ఉడత కబుర్లు చెప్పవద్దు, ప్రజలారా ఇలాంటి ఉడత కథలు నమ్మవద్దు. ఇలాంటి ప్రమాదాలు జరగటానికి అధికారుల చిన్నబుద్ధులే కారణం. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

నార్నె వెంకట సుబ్బయ్య

జీఎస్టీ ప్రధాన పన్ను సంస్కరణ: మోదీ

న్యూదిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ని ప్రధాన పన్ను సంస్కరణగా ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇది 'సులభతర వ్యాపారం', 'ఒకే దేశం ఒకే పన్ను' లక్ష్యాన్ని నెరవేర్చిందని అన్నారు. దేశంలో జీఎస్టీ జులై1, 2017 అర్ధరాత్రి అమలులోకి వచ్చింది. జీఎస్టీ ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ప్రధాని శు క్రవారం ట్వీట్ చేశారు. జీఎస్టీ... భారతదేశ కొత్త ఆర్థిక నిర్మాణాన్ని నిర్వచించడంలో, ప్రజలను సాధికారికులను చేయడంలో కీలక పాత్ర పోషించిందని భారతప్రభుత్వ 'మై జీఓవీ ఇండియా' పోర్టల్ పేర్కొంది. ఈ కథనాన్ని ప్రధాని తన ట్వీట్‌కు జతచేశారు.

దేశానికి ఇప్పుడు ఐక్యత కావాలి

నోబెల్ గ్రహీత అమర్త్యసేన్



కోల్‌కతా: దేశంలో ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే తనకు భయంగా ఉందని అన్న ఆయన దేశీయుల మధ్య ఐక్యత లోపించిందని మునుపటిలా ఐక్యంగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. గురువారం కోల్‌కతాలోని సాల్ట్ లేక్‌లో అమర్త్యసేన్ పరిశోధనా కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

'దేనికైనా భయపడుతున్నారా అని నన్ను అడిగితే, అవును, భయపడుతున్నాననే చెప్తాను. ఆ భయానికి కారణం ఉంది. దేశంలోని ప్రస్తుత పరిస్థితి నా భయం వెనుకున్న కారణం. ఎందుకంటే దేశం సమైక్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఇది సహనానికి సంబంధించిన విషయం కాదు. దేశం మునుపటిలా ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఇంకా ఆయన మాట్లడుతూ "భారతదేశం కేవలం హిందువులది మాత్రమే కాదు. ముస్లింలే ఈ దేశాన్ని రూపొందించలేరు. అందరూ ఐక్యంగా ఉండి నిర్మించుకోవాలి" అని అన్నారు.

కేంద్రంలోని అధికార పార్టీ బీజేపీ తీరుపై విస్మయం వ్యక్తం చేస్తూ.. ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన దేశంలోని బహుళత్వాన్ని తుడిచిపెట్టే అధికారాన్ని పొందినట్టు కాదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ముస్లిం ప్రభావాన్ని తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ సత్యాన్ని తారుమారు చేయలేరని, ఆ విషయం మనందరికీ తెలుసునన్నారు. భారతీయ చరిత్రలో మొఘలుల ప్రభావం ప్రధానమైనదేనని పేర్కొన్నారు. ఈ దేశం ఆర్యభట్టు దేశమని, సైన్స్ సాధనలో యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్న దేశమని గుర్తు చేశారు. అష్టదిగ్గజాలు దేశ సంప్రదాయాలకు అనుగుణంగా ఐక్యంగా ఉండాలని అమర్త్యసేన్ పిలుపునిచ్చారు.

ఒకే వేదికపై ద్రౌపది ముర్ము, ప్రణబ్ ముఖర్జీ, యశ్వంత్ సిన్హా

న్యూదిల్లీ: రాష్ట్రపతి ఎన్నికలు సమీపిస్తున్న వేళ అరుదైన ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆ ఫొటోలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రస్తుతం రాష్ట్రపతి రేసులో ఉన్న ద్రౌపది ముర్ము, యశ్వంత్ సిన్హా ఉన్నారు. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఉన్న వినోబా భావే యూనివర్సిటీలో జరిగిన 7వ స్నాతకోత్సవానికి సంబంధించిన ఫొటో ఇది. ఈ కార్యక్రమానికి అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న ప్రస్తుత ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము యూనివర్సిటీ చాన్స్‌లర్ హోదాలో హాజరయ్యారు. ఘనంగా జరిగిన ఈ స్నాతకోత్సవంలో ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా ప్రస్తుతం ప్రతిపక్షాల తరపు రాష్ట్రపతి రేసులో ఉన్న యశ్వంత్ సిన్హా గౌరవ డి.లిట్ డిగ్రీ అందుకున్నారు. ఒకే ఫ్రేమ్‌లో వీరి ఫొటో సోషల్ మీడియాలో తెగ షేర్ అవుతోంది.

సత్యేందర్ జైన్ కేసులో ఇద్దరు వ్యాపారుల అరెస్టు

న్యూదిల్లీ: దిల్లీ రాష్ట్రమంత్రి సత్యేందర్ జైన్‌పై నమోదైన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆయనతో సంబంధాలు ఉన్న ఇద్దరు వ్యాపారవేత్తలు వైభవ్‌జైన్, అంకుశ్ జైన్‌లను అరెస్టు చేసింది. శు క్రవారం అధికారులు ఈ సంగతి వెల్లడించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)లోని క్రిమినల్ సెక్షన్ల కింద ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సత్యేందర్ జైన్‌ను పీఎంఎల్‌ఏ కింద మే 30న ఈడీ అరెస్ట్ చేయగా, ఆయన ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతృత్వంలోని దిల్లీ ప్రభుత్వంలో జైన్ పోర్ట్‌ఫోలియో లేని మంత్రి. అంతకుముందు జైన్... ఆరోగ్యం, విద్యుత్ సహా కొన్ని ఇతర బాధ్యతలను నిర్వహించారు. మంత్రిని అరెస్టు చేసిన తర్వాత ఈడీ అతని కుటుంబం , సహచరుల నివాసాలు, ఆస్తులపై రెండు పర్యాయాలు దాడులు నిర్వహించింది. సత్యేందర్ జైన్ కుటుంబం , ఇతరుల నివాసాలపై జూన్ 6న నిర్వహించిన మొదటి విడత దాడుల తర్వాత రూ. 2.85 కోట్ల విలువైన లెక్కలు లేని నగదు, 133 బంగారు నాణేలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. విచారణలో భాగంగా ఏప్రిల్‌లో సత్యేందర్ జైన్ కుటుంబానికి చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. జైన్‌ను తప్పుడు కేసులో ఇరికించారని, విచారణ తర్వాత ఆయన స్వచ్ఛంగా బయటకు వస్తారని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆకాంక్షించారు.

భారీగా పెరిగిన బంగారం ధర!

ఒక్కరోజే రు. 1310 పెరుగుదల

న్యూదిల్లీ: బంగారం ప్రియులకు కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ భారీ షాక్ ఇచ్చింది. పసిడిపై బేసిక్ దిగుమతి సుంకం 15 శాతానికి పెంచుతున్నట్లు కేంద్రం ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది. గురువారం నుంచే పెరిగిన ధర అమల్లోకి వస్తుందని ప్రకటించింది. దీంతో దేశీయ బులియన్ మార్కెట్‌లో 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర శుక్రవారం ఒక్కరోజే రూ.1310 పెరిగి రూ.52,200 వద్ద స్థిర పడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధరలు స్వలంగా తగ్గుముఖం పట్టాయి. క్రితం ట్రేడింగ్‌తో పోలిస్తే ఈ రోజు ట్రేడింగ్‌లో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 1794 డాలర్లు, ఔన్స్ వెండి ధర 19.76 డాలర్లుగా నిలిచింది. అంతర్జాతీయంగా పెరిగిన ముడి చమురు, ఇతర వినిమయ వస్తువుల ధరల ప్రభావంతో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ ఈ వారం ఆల్‌టైం కనిష్ఠ స్థాయి రూ.79లకు పడి, తిరిగి పుంజుకున్నది. దీంతో ఎగుమతుల కంటే దిగుమతుల విలువ ఎక్కువైంది. ఫలితంగా కరంట్ ఖాతా లోటు పెరిగింది.

క్యాడ్ ప్రభావాన్ని తగ్గించేందుకు, బంగారం దిగుమతిని నిరుత్సాహ పరిచేందుకు దానిపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచివేసింది. భారత్‌లో బంగారం వినియోగదారులు పూర్తిగా దిగుమతిపైనే ఆధార పడి ఉంటారు.మే నెల వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో 24.3 బిలియన్ డాలర్లకు చేరుకోవడంతో కేంద్రం వివిధ దిగుమతులపై తీవ్రంగా దృష్టి సారించింది. ప్రత్యేకించి బంగారం దిగుమతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నది. కరంట్ ఖాతా లోటు (క్యాడ్) పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నది. గతేడాదితో పోలిస్తే మే నెలలో బంగారం దిగుమతులు తొమ్మిది రెట్లు పెరిగి 7.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

లవ్ లెటర్ వచ్చింది: ఐటీ నోటీసుపై పవార్ వ్యాఖ్య

ముంబై: ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసు రావడంపై 'లవ్ లెటర్' వచ్చిందంటూ ఎన్సీపీ అధినేత శరద్ పవార్ చమత్కరించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉద్ధవ్ థాకరే రాజీనామా చేసిన మరునాడే పవార్‌కు నోటీసు రావడం గమనార్హం. కాగా 2004, 2009, 2014, 2020 ఎన్నికల్లో పవార్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లో ఉన్న సమాచారాన్ని తాజాగా పరిశీలిస్తున్నారట. అందుకే తనకు నోటీసు అందిందని శరద్ పవార్ తెలిపారు. విభిన్న భావజాలం ఉన్న వ్యక్తులపై ఇలా ప్రభుత్వ సంస్థలను ప్రయోగించడం సాధారణమైందని విమర్శించారు. ఈ విషయమై స్పందిస్తూ ఆయన గురువారం రాత్రి వరుస ట్వీట్లు చేశారు. "ఈడీ లాంటి కేంద్ర ఏజెన్సీ సంస్థలు ఈరోజుల్లో చాలా ఉపయోగపడుతు న్నాయి. మంచి ఫలితాలను సైతం ఇస్తున్నాయి. విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు అందాయని పలువురు శాసన సభ్యులు చెబుతున్నారు. ఈ కొత్త పద్ధతి ఈ మధ్యే మొదలైంది. ఐదు సంవత్సరాల క్రితం ఈడీ పేరు మాకు కూడా తెలియదు. కానీ ఈరోజు పల్లెటూరిలో సైతం నీ వెనకాల ఈడీ ఉందంటూ జోకులు వేసుకుంటున్నారు. విభిన్న అభిప్రాయాలు కలిగిన వ్యక్తుల కోసం ఈ వ్యవస్థలు ఉపయోగపడుతున్నాయి. నాక్కూడా ఆదాయపు పన్ను శాఖ నుంచి ఇలాంటి ఒక ప్రేమ లేఖ వచ్చింది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినప్పటి అఫిడవిట్‌లో ఉన్న సమాచారాన్ని ఇప్పుడు పరిశీలిస్తున్నారట.

2004, 2009లలో లోక్‌సభకు పోటీ చేశారు. ఆ తర్వాత 2014, 2020లో రాజ్యసభకు పోటీ చేశారు. ఈ ఎన్నికల అఫిడవిట్‌లకు సంబంధించిన నోటీసులు కూడా వచ్చాయి. అదృష్టవశాత్తూ అప్పటి సమాచారం అంతా నా దగ్గర ఉంది. కాబట్టి సమాచారం ఇవ్వడానికి నేను చింతించను. చాలా సంవత్సరాల సమాచారాన్ని సేకరించడం, నిర్దిష్ట వ్యక్తుల నుంచి సమాచారాన్ని సేకరించడం వ్యూహాత్మకంగా కనిపిస్తోంది" అని పవార్ ట్వీట్లు చేశారు.

షిండే సహా తిరుగుబాటు ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై శివసేన పిటిషన్

జులై11న సుప్రీంకోర్టులో విచారణ

న్యూదిల్లీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పాటు అనర్హత పిటిషన్లు పెండింగ్‌లో ఉన్న 15 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు శాసనసభలో అడుగుపెట్టకుండా సస్పెన్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ శివసేన చీఫ్ విప్ సునీల్ ప్రభు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను జూలై 11న విచారించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. అయితే దీనిపై అత్యవసర విచారణను తిరస్కరించింది. ముఖ్యమంత్రి సహా 16 మంది శాసనసభ్యులపై అనర్హత చర్యలు పెండింగ్‌లో ఉన్నందున మధ్యంతర పిటిషన్‌పై అత్యవసర విచారణ అవసరమని ప్రభు తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్... న్యాయమూర్తులు సూర్యకాంత్, జేబీ పార్థివాలాతో కూడిన వెకేషన్ బెంచ్‌ను కోరారు. 'ఇబ్బంది కలిగిస్తున్నందుకు నన్ను క్షమించండి...మేము ఒక దరఖాస్తును దాఖలు చేశాము.జూన్ 29న ఒక ఉత్తర్వును ఆమోదించారు. ఆ తర్వాత ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో విలీనం లేనందున ఓట్లను ఎలా లెక్కించాలి అనేది అసెంబ్లీకి, మనందరికీ ఎదురయ్యే సమస్య' అని సిబల్ చెప్పారు. 'ఇరు పక్షాలు (శివసేన) విప్ జారీ చేయబోతున్నాయి. సభా కార్యక్రమాలను ఎలా నియంత్రించగలం? ఎవరి విప్‌ను లెక్కిస్తారు? అతను (షిండే) పార్టీ కాదు, ఆ విషయాన్ని నేరుగా ఎన్నికల సంఘం మాత్రమే నిర్ణయించగలదు. ఇది ప్రజాస్వామ్య నృత్యం కాదు' అని ఆయన అన్నారు. కాగా ఈ సమస్యపై తమకు పూర్తి అవగాహన ఉందని, డిప్యూటీ స్పీకర్ జారీ చేసిన అనర్హత నోటీసులకు వ్యతిరేకంగా 16 మంది తిరుగుబాటు శివసేన ఎమ్మెల్యేల ప్రధాన అభ్యర్థనను జులై 11న విచారించనున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్‌ను కూడా దానితోపాటు కలిపి విచారణ చేస్తామని తెలిపింది. 'మేము సమస్యను ఖచ్చితంగా పరిశీలిస్తాము. ఎలాంటి విధానాలు అవలంబిస్తున్నారో చూద్దాం. విధానం లోపభూయిష్టంగా ఉంటే, దయచేసి అఫిడవిట్ దాఖలు చేయండి, మేము దానిని కూడా పరిశీలిస్తాము' అని బెంచ్ స్పష్టం చేసింది. కాగా 16 మంది తిరుగుబాటు సేన ఎమ్మెల్యేలకు పంపిన అనర్హత నోటీసులకు సమాధానం ఇవ్వడానికి జులై 12 వరకు గడువును పొడిగిస్తూ జూన్ 27న కోర్టు వెకేషన్ బెంచ్ షిండే వర్గానికి మధ్యంతర ఉపశమనం మంజూరు చేసిన సంగతి విదితమే. జూన్ 29న రాత్రి ఏడున్నర గంటలకు ఏక్‌నాథ్ షిండే సీఎంగా, దేవేంద్ర ఫడ్నవిస్ డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. కాగా మహారాష్ట్ర అసెంబ్లీ రెండురోజుల ప్రత్యేక సమావేశాలు 3వ తేదీనుంచి ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో సుప్రీంకోర్టులో శివసేన ఈ పిటిషన్ ను దాఖలు చేసింది.

రాక్రేలు ఉన్నచోటే శివసేన: రౌత్

ముంబై: పార్టీని చీల్చిన ఎమ్మెల్యేల బృందంతో ఏక్‌నాథ్ షిండే అధ్వర్యాన మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేసిందని శివసేన నాయకుడు సంజయ్ రౌత్ శుక్రవారం విలేకరులతో అన్నారు. అది నిజమైన శివసేన కాదని పేర్కొన్నారు. రాక్రేలు ఉన్న చోట సేన ఉందని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌పై విరుచుకుపడిన రౌత్... రెండున్నరేళ్ల పాటు సీఎం పదవిని పంచుకునే విషయంలో 2019లో బీజేపీ తన మాటకు కట్టుబడి ఉంటే, తన పార్టీ కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రయోగం చేసి ఉండేదని రౌత్ అన్నారు. ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీజేపీ ఏం సాధించిందని రౌత్ ప్రశ్నించారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం శివసేన-బీజేపీ ప్రభుత్వమా అనే ప్రశ్నకు ఆయన బదులిస్తూ...ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో మా పార్టీని విస్తరించేందుకు ప్రయత్నిస్తామని, సేన నుంచి విడిపోయిన ఒక వర్గం బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రౌత్ పేర్కొన్నారు. శివసేనను చీల్చాలన్న షిండే ఎత్తుగడ పార్టీని బలహీనపరచదని రౌత్ ఉద్ఘాటించారు. తిరుగుబాటు గ్రూపు కంటే బీజేపీకి ఎక్కువ సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఫడ్నవీస్ తనను ముఖ్యమంత్రిని చేయడం ద్వారా విశాల హృదయాన్ని చాటారని షిండే చేసిన వ్యాఖ్యపై స్పందిస్తూ... విశాల హృదయానికి కొత్త ముఖ్యమంత్రి నిర్వచనం భిన్నంగా ఉండవచ్చునన్నారు. కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సేనలో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన షిండే, ఫడ్నవీస్ కలిసి వ్యవసాయం, నిరుద్యోగం వంటి సమస్యలను కలిసి పరిష్కరించాలని ఆకాంక్షించారు.

పక్షం రోజులకోసారి 'పన్ను' సమీక్ష

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూదిల్లీ : అంతర్జాతీయ ధరల ఆధారంగా విమాన ఇంధనం (ఏటీఎఫ్), డీజిల్, ముడి చమురుపై విధించే కొత్త పన్నులను ప్రభుత్వం ప్రతి 15 రోజులకు సమీక్షిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శు క్రవారం తెలిపారు. ఇవి 'అసాధారణ సమయాలు', అంతర్జాతీయ చమురు ధరలు హద్దులు లేనివని ఆమె అన్నారు. 'మేము ఎగుమతులను నిరుత్సాహపరచకూడదద నుకుంటున్నాం. కానీ దేశీయంగా అందుబాటును పెంచాలనుకుంటున్నాం' అని ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. చమురు అందుబాటులో లేదంటే, ఎగుమతులు అసాధారణ లాభాలతో జరుగుతుంటే, మన పౌరులకు కనీసం కొంత అవసరమని అన్నారు. 'మేము ఈ జంట కోణ విధానాన్ని అనుసరించాలి' అని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌పై ఎగుమతి పన్నుతో పాటు దేశీయ ముడి చమురు ఉత్పత్తిపై విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించింది. రెవెన్యూ కార్యదర్శి తరుణ్ బజాజ్ మాట్లాడుతూ సెజ్ యూనిట్లపై కొత్త పన్నులు వర్తిస్తాయని, అయితే ఎగుమతి ఆంక్షలు వర్తించవని చెప్పారు. రూపాయిపై ఆర్థిక మంత్రి సీతారామన్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్, ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయని, దిగుమతులపై రూపాయి విలువ ప్రభావం చూపుతుందని ప్రభుత్వం స్పృహ కలిగి ఉందని అన్నారు.

జుబేర్ పిటిషన్‌పై మీ వైఖరేంటి...?

పోలీసులను ప్రశ్నించిన దిల్లీ హైకోర్టు

న్యూదిల్లీ : హిందూ దేవతకు వ్యతిరేకంగా 2018లో చేసిన అభ్యంతరకర ట్వీట్‌కు సంబంధించిన కేసులో తన పోలీసు రిమాండ్ చట్టబద్ధతను సవాలు చేస్తూ ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహ్మద్ జుబైర్ చేసిన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు శుక్రవారం దిల్లీ పోలీసుల వైఖరిని కోరింది. జస్టిస్ సంజీవ్ నరులా ఈ పిటిషన్‌పై నోటీసు జారీ చేశారు. జుబేర్‌ను పోలీసులకు నాలుగు రోజుల కస్టడీని మంజూరు చేస్తూ జూన్ 28న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల చట్టబద్ధత, యాజమాన్యాన్ని సవాలు చేసే పిటిషన్‌పై ప్రతిస్పందన దాఖలు చేయడానికి దర్యాప్తు సంస్థకు రెండు వారాల సమయం ఇచ్చింది. జులై 27న తదుపరి విచారణ కోసం న్యాయమూర్తి కేసును జాబితా చేశారు. ప్రస్తుత విచారణల ప్రభావం లేకుండా కింది కోర్టు ముందు విచారణ కొనసాగుతుందని చెప్పారు. జులై 2తో రిమాండ్ గడువు ముగుస్తుందని పేర్కొన్న కోర్టు.. 'పోలీసు రిమాండ్‌కు నాలుగు రోజులు గడువు ఉంది.. మరో వైపు నేను వినాల్సి ఉంటుంది.. నోటీసు జారీ చేస్తాను' అని తెలిపింది. ట్వీట్లలో ఒకదాని ద్వారా మతపరమైన మనోభావాలను దెబ్బతీసినందుకు జుబైర్‌ను జూన్ 27న దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అదే రోజు కింది కోర్టు ఒకరోజు పోలీసు కస్టడీకి పంపింది. జుబేర్ ఒకరోజు కస్టోడియల్ ఇంటరాగేషన్ గడువు ముగిసిన తర్వాత, అతని కస్టడీని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ స్నిగ్ధ సర్వరియా మరో నాలుగు రోజులు పొడిగించారు. కింది కోర్టు ఆదేశం ప్రకారం, నాలుగు రోజుల పోలీసు రిమాండ్ ముగియడంతో జులై 2న జుబైర్‌ను తదుపరి కోర్టు ముందు హాజరుపరచనున్నారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీశారంటూ ట్విట్టర్ యూజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బడా వ్యాపారులకు మోదీ వత్తాసు

- రైతులకు చేసిందేమీ లేదు
- రాహుల్‌గాంధీ విమర్శ

వయనాడ్ (కేరళ): దేశంలోని రైతుల కోసం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం...రైతాంగానికి చేసిన మేలు ఏమీలేదని, బడా కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం బడా కార్పొరేట్ల రుణాలను మాఫీ చేసి, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు మొండిచేయి చూపిందని రాహుల్ నిశితంగా విమర్శించారు. తాను ప్రాతినిధ్యం వహించే వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం రాహుల్ ఇక్కడకు చేరుకున్నారు. కొండ ప్రాంతం మనంతవాడిలో వ్యవసాయ సహకార సంఘం కొత్త భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... పర్యావరణ సున్నిత ప్రాంతం (ఈఎస్‌జెడ్) సమస్యపై ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు తన కార్యాలయాన్ని ధ్వంసం చేసిన రాహుల్ తన నియోజకవర్గానికి రావడం ఇదే ప్రథమం. రాహుల్ మాట్లాడుతూ... క్రూర మృగాలనుంచి పంటలను రక్షించడానికి రాష్ట్రంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి ఎటువంటి వ్యూహం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని అనేక చోట్ల మానవ-జంతు సంఘర్షణల సమస్యను పరిష్కరించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం పునాది అని ఆయన అభివర్ణిస్తూ, వ్యవసాయం అభివృద్ధి చెందకుండా విజయవంతంగా అభివృద్ధి చెందిన దేశం ప్రపంచంలోనే లేదని అన్నారు. లెఫ్ట్ ప్రభుత్వంలో రైతులు, వ్యవసాయాన్ని నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. రైతుల తీవ్ర నిరసనల నేపథ్యంలో కేంద్రం రద్దు చేసిన వివాదాస్పద వ్యవసాయ చట్టాలను ప్రస్తావిస్తూ...రైతులను, వ్యవసాయాన్ని రక్షించే దృక్పథాన్ని ప్రభుత్వాలు కలిగి ఉండాలన్నారు. పెద్ద వ్యాపారులు, రైతులను భిన్నంగా చూడాలనే ఆలోచనను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. 'పెద్ద వ్యాపారులు రుణాలు తీసుకుంటారు... రుణాలు ఎగవేసిన వారికి రుణాలు మాఫీ చేస్తారు... మరోవైపు రైతులు చిన్న మొత్తాలను రుణాలుగా తీసుకుంటే సర్ఫేసీ చట్టం కింద నోటీసులు జారీచేస్తారు' అంటు రాహుల్ మోదీ సర్కారు దుయ్యబట్టారు. పెద్ద వ్యాపారులకు, రైతుల మధ్య వివక్ష ఎందుకు చూపుతున్నారని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వ రైతు అనుకూల విధానాలను, మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాల అమలుకు వ్యతిరేకంగా రైతుల ఆందోళనలో కాంగ్రెస్ పాత్రను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అంతకుముందు మూడు రోజుల పర్యటన నిమిత్తం కేరళ వచ్చిన రాహుల్‌కు ఆ రాష్ట్ర పార్టీ చీఫ్ కె సుధాకరన్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. తిరువనంతపురంలోని అధికార సీపీఐ(ఎం) ప్రధాన కార్యాలయం ఏకేజీ సెంటర్‌పై దాడి ఘటనపై రాష్ట్రంలో ఉద్రిక్త నెలకొన్న నేపథ్యంలో గాంధీ పర్యటన సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎకెజి సెంటర్‌పై బాంబు దాడి వెనుక కాంగ్రెస్ పాత్ర ఉందని సీపీఎం ఆరోపించింది. రాహుల్ గాంధీ ఆదివారం కోజికోడ్ నుంచి దిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

బీజేపీ అనైతికంగా అధికారంలోకి...

- 'సామ్నా'లో శివసేన విమర్శ

ముంబై : అనైతిక మార్గాల ద్వారా రాష్ట్రంలో బీజేపీ అధికారాన్ని పొందుతోందని శివసేన శుక్రవారం ఆరోపించింది. దేవేంద్ర ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయవలసి వస్తే 2019లో రొటేషన్ ముఖ్యమంత్రి ఒప్పందాన్ని పార్టీ ఎందుకు గౌరవించలేదని ప్రశ్నించింది. పార్టీ పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో పార్టీలను విచ్ఛిన్నం చేయడం, అధికారాన్ని కాపాడుకోవడంపై తనకు నమ్మకం లేదని ఒకప్పుడు చెప్పిన దివంగత ప్రధాని, బీజేపీ అగ్రనేత అటల్ బిహారీ వాజ్‌పేయిని గుర్తుచేసుకుంది. ప్రస్తుత బీజేపీ దానిని గమనించాలని అన్నారు. బీజేపీ మొదట తిరుగుబాటు ఎమ్మెల్యేలను, ప్రధానంగా శివసేనకు చెందిన వారిని అసోంకు తరలించడానికి ముందు సూరత్‌కు తీసుకువెళ్లిందని, ఆపై గోవాకు తరలించిందని సేన పేర్కొంది. బాల్ థాకరే, హిందుత్వకు 'ద్రోహం' చేసిన ఎమ్మెల్యేలను రక్షించడానికి ప్రత్యేక విమానాన్ని ఉపయోగించి దేశ సరిహద్దులను రక్షించడానికి ఉద్దేశించిన వేలాది మంది భద్రతా సిబ్బందిని ముంబైకి తీసుకువచ్చారని పేర్కొంది. 'మీరు అనైతిక మార్గాల ద్వారా అధికారాన్ని పొందారు. కానీ తరువాత ఏమిటి? ఈ ప్రశ్నకు ప్రజలే సమాధానం చెప్పాలి. ముఖ్యమంత్రి కావాలనుకున్న దేవేంద్ర ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం ఆశ్చర్యానికి గురి చేసిందని పార్టీ పేర్కొంది. అపరిమిత అధికారాన్ని, అత్యధిక మెజారిటీని బీజేపీ దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. 'ప్రతిపక్ష పార్టీలను అంతం చేయడం ద్వారా ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుంది' అని ప్రశ్నించింది. 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, ముఖ్యమంత్రి పదవిని పంచుకోవడంలో విభేదాల కారణంగా బీజేపీ, శివసేన విడిపోయాయి.

మాకెందుకు పదవి నిరాకరించారు

- 2019లో బీజేపీ 'సీఎం రొటేషన్' హామీపై ఉద్ధవ్ ఆశ్చర్యం
- షిండే 'సేన' సీఎం కాదు
- తిరుగుబాటు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే

ముంబై : 2019లో సీఎం పదవి రొటేషన్ ప్రాతిపదికన ఉంటుందన్న హామీని నిలబెట్టుకోలేనప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా 'శివ సైనికుడిగా పిలవబడే' వ్యక్తిని ఎంపిక చేస్తూ తాజాగా బీజేపీ తీసుకున్న నిర్ణయంపై శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్య ముంబైలోని దాదర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం శివసేన భవన్ వద్ద విలేకరుల సమావేశాన్ని ఉద్దేశించి ఉద్ధవ్ మాట్లాడుతూ తమ పార్టీలో జరిగిన తిరుగుబాటు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని, ప్రజల ఓట్లను వృథా చేయడమేనని అభివర్ణించారు. తన ప్రభుత్వ పతనానికి దారితీసిన ఇటీవలి రాజకీయ పరిణామాలపై వ్యాఖ్యానిస్తూ, ప్రజా ప్రతినిధులను రీకాల్ చేసే హక్కుపై ఠాక్రే నొక్కి చెప్పారు. రెండున్నరేళ్ల క్రితం రొటేషన్ ముఖ్యమంత్రిపై ఎలాంటి ఒప్పందం కుదరలేదని బీజేపీ ఎందుకు తిరస్కరించిందని ప్రశ్నించారు. బీజేపీ అంగీకరించి ఉంటే అధికార మార్పిడి సునాయాసంగా, గౌరవప్రదంగా జరిగి ఉండేదని అన్నారు. మిగిలిన కాలం కూడా సొంత ముఖ్యమంత్రి లేనప్పుడు బీజేపీకి ఏం లాభం అని ప్రశ్నించారు. 'ఈ (షిండే) ప్రభుత్వాన్ని ఏర్పరచిన విధానం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వారు (బీజేపీ) 'శివసైనికుడిని' అని పిలుస్తున్న వ్యక్తిని ముఖ్యమంత్రిని చేశారు. నాకు, అమిత్ షాకు మధ్య నిర్ణయించుకున్నట్లు ప్రతిదీ జరిగి ఉంటే, అధికార మార్పు సునాయాసంగా ఉండేది. ముఖ్యమంత్రిని కాను లేదా మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ఏర్పడేది కాదు' అని ఠాక్రే అన్నారు. ఏక్‌నాథ్ షిండే 'శివసేన ముఖ్యమంత్రి కాదు' అని పేర్కొన్న ఆయన పార్టీ సహాయకుడిని ఉంచడం ద్వారా శివసేన ఉండదని అన్నారు. 'రెండున్నరేళ్ల క్రితం మాటను నిలబెట్టుకోని వాళ్లు (సేన)ని వెన్నుపోటు పొడిచి... మళ్లీ శివసేన (షిండే)ని సీఎం అంటూ శివసైనికుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇది సేన సీఎం కాదు. సేనను పక్కన పెట్టడం ద్వారా సేన సీఎం కాలేదు' అని ఠాక్రే అన్నారు. ఆరే కాలనీలోని మెట్రో-2 కార్ షెడ్ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లవద్దని ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన తన మంత్రివర్గ తొలి సమావేశంలో షిండే, ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కంజుర్‌మార్గ్‌కు బదులుగా ఆరే కాలనీలో మెట్రో-3 కార్ షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనను సమర్పించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఠాక్రే నేతృత్వంలోని ప్రభుత్వం ఆరే కాలనీ నుంచి కుంజర్‌మార్గ్‌కు కార్ షెడ్‌ను మార్చాలన్న ప్రతిపాదన చేసింది. అయితే అది న్యాయ వివాదంలో చిక్కుకుంది. ఆరే మెట్రో కార్ షెడ్ విషయంలో తనకు 'ద్రోహం" చేసినట్లుగా ముంబైకి ద్రోహం చేయవద్దని బీజేపీని కోరారు. ముంబైలోని కంజుర్‌మార్గ్ నుంచి ఆరే కాలనీకి మెట్రో కార్ షెడ్‌ను మార్పు చేసే మహారాష్ట్ర ప్రభుత్వ కొత్త ప్రణాళిక బాధ కలిగించిందని అన్నారు. 'నేను చాలా కలత చెందుతున్నాను. మీకు నాపై కోపం ఉంటే, దాన్ని బయట పెట్టండి. కానీ ముంబైని దాని గుండెల్లో పొడిచకండి. ఆరే నిర్ణయాన్ని తోసిపుచ్చినందుకు నేను చాలా బాధపడ్డాను. ఇది వ్యక్తిగత ఆస్తి కాదు' అని ఠాక్రే అన్నారు. ఆరే ప్రజా ఉద్యమాన్ని ఒకసారి చూస్తే, అది చుట్టుపక్కల ఉన్న వన్యప్రాణులను దెబ్బతీస్తుందనేది తన ఆందోళన అని తెలిపారు.

బీజేపీ సంబరాలకు ఫడ్నవీస్ గైర్హాజరు

ముంబై: మహారాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన వేడుకలకు ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గైర్హాజరయ్యారు. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని ఎంవీఏ ప్రభుత్వం పతనం తర్వాత రెండున్నరేళ్ల తర్వాత మహారాష్ట్రలో తిరిగి అధికారంలోకి వచ్చిన సందర్భంగా దక్షిణ ముంబైలోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని కొత్త ప్రభుత్వంలో తాను భాగం కాబోనని గురువారం ప్రకటించిన ఫడ్నవీస్, ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినప్పటికీ, వేడుకకు హాజరు కాలేదు. జులై 3 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న మహారాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశానికి ముందు ఆయన తన నివాసంలో సమావేశాలు నిర్వహించడంలో బిజీగా ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి సన్నిహితుడు తెలిపారు. కాగా శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమైన బీజేపీ జాతీయ కార్యవర్గానికి ఫడ్నవీస్ హాజరవుతారా అని అడిగిన ప్రశ్నకు, ఆయన మా జాతీయ నాయకులతో మాట్లాడి ఇక్కడి పరిస్థితుల గురించి వారికి తెలియజేశాడని సంబంధిత వర్గాలు తెలిపాయి.

రైతు ఆదాయం రెట్టింపునకే తొలి ప్రాధాన్యత : గోయల్

ముంబై: రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం తెలిపారు. వ్యవసాయ దారుల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలనూ చేపడుతోందని అన్నారు. 'రైతులు, వారి సంక్షేమం, ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోంది' అని నాబార్డ్, డిజిటల్ వాణిజ్యానికి బహిరంగ నెట్వర్క్ (ఓఎన్‌డీసీ) నిర్వహించిన కార్యక్రమంలో గోయల్ నొక్కిచెప్పారు. 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు 2017లో ప్రభుత్వం హామీనిచ్చిన విషయం విదితమే. ఇదే వ్యవహారంలో నీతిఆయోగ్ నివేదిక సిద్ధం చేసింది. ఈ హామీని 2023 చివరికి ఆచరణలో పెట్టేందుకు కార్యాచరణ ప్రణాళికనూ రూపొందించింది. దీంతో రైతు వార్షిక ఆదాయం 10.41శాతం పెరుగుతుందని నిపుణులు అంచనా వేశారు. సొంత లాభాల కోసం ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో తాము ఎంపిక చేసిన వేదికలు/ మాధ్యమాలను వినియోగదారులు ఎంచుకునేలా టెక్‌సంస్థలు చాకచక్యంగా వ్యవహరిస్తుంటాయని గోయల్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఓఎన్‌డీసీ ద్వారా అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలను చూసి భయపడే చుట్టుపక్కల కిరాణా లేదా చిన్న దుకాణదారులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఓఎన్‌డీసీ వల్ల ఆధునిక, హైప్రొఫైల్ దుకాణాలతో కిరాణా దుకాణాలు పోటీ పడవచ్చు అని, తద్వారా మనుగడ సాగించడమే కాకుండా ఆదాయాన్ని పెంచుకోగలవని అన్నారు.

అగ్నివీరుల నియామకాలు షురూ

న్యూఢిల్లీ: సైన్యంతో పాటు నావికా దళంలో అగ్నిపథ్ పథకం కింద నియామకాల ప్రక్రియ శుక్రవారం మొదలు అయిందని రక్షణశాఖ తెలిపింది. భారతీయ వైమానిక దళం జూన్ 24న నియామక ప్రక్రియను ప్రారంభించగా 2.27 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించింది. నేవీలో నియామకాల ప్రక్రియ మొదలు అయింది. నేటి నుంచి దరఖాస్తు చేసుకోండి. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలన్న మీ కలలను అగ్నివీరులుగా సాకారం చేసుకోండి' అని ట్వీట్ చేసింది. జూన్ 14న ఈ పథకాన్ని కేంద్రం ప్రకటించగా దేశవ్యాప్తంగా వారానికిపైగా నిరసనలు జరిగాయి. కొన్నిచోట్ల హింస చోటుచేసుకుంది. ఈపథకాన్ని ఉపసంహరించుకోవాలన్న డిమాండు మిన్నంటింది. విపక్షాలు సైతం ఆందోళలకు మద్దతివ్వడం తెలిసిందే.

కేరళలో సీపీఎం కార్యాలయంపై దాడి

ఇది కాంగ్రెస్ పనే : ఎల్డీఎఫ్

తిరువనంతపురం: కేరళ సీపీఎం కేంద్ర కార్యాలయం ఏకేజీ సెంటర్‌పై నాటు బాంబు దాడి జరిగింది. దీని వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందని ఎల్డీఎఫ్ కన్వీనర్ ఈపీ జయరాజన్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతికి విఘాతం చేయాలని యూడీఎఫ్ కుట్ర చేసిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎ.విజయరాఘవన్ అన్నారు. దాడికి నిరసనగా సీపీఎం యూత్ వింగ్ డీవైఎఫ్ఐ నిరసన ప్రదర్శన నిర్వహించింది. నిరసన తెలిపే క్రమంలో మితిమీరి ప్రవర్తించ వద్దు అని పార్టీ శ్రేణులకు నాయకులు సూచించారు. ఏకేజీ సెంటర్ ప్రధాన ద్వారాన్ని గురువారం రాత్రి 11.30 గంటలప్పుడు నాటు బాంబుతో రెండు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్లు ధరించి వచ్చిన ఇద్దరు పేల్చివేసినట్లు పార్టీ కార్యకర్తలు తెలిపారు. ఆ సమయంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పీకే శ్రీమతి కార్యాలయంలోనే ఉన్నారన్నారు. పేలుడు శబ్దాన్ని చుట్టుపక్కల వారు విన్నారుగానీ అది బాంబు అని నిర్ధారించడం కష్టమని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఘటనాస్థలాన్ని సీనియర్ పోలీసు అధికారులు సందర్శించి ఆరా తీసినట్లు పేర్కొన్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటనకు కొన్ని గంటల ముందు ఈ దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది.





ఇది పిరికిపంద చర్య

సీపీఎం కార్యాలయంపై దాడికి సీపీఐ ఖండన

న్యూఢిల్లీ: సీపీఎం కేరళ రాష్ట్ర కమిటీ కార్యాలయంపై గురువారం రాత్రి జరిగిన బాంబు దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద చర్య అని, దీనిని ఐక్యంగా ఖండించాలని ప్రజాస్వామ్యా, ప్రగతిశీల శక్తులకు పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్యంపై దాడులను ఉపేక్షించరాదని, నిందితులను అరెస్టు చేసి, విచారణ అనంతరం శిక్షించాలని సీపీఐ డిమాండు చేసింది.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.